


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 225, పేజీలు - 08
బుధవారం, జనవరి 28, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా

## ఫిబ్రవరి 11న పోలింగ్, 13న కౌంటింగ్

- 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల
- తక్షణమే రాష్ట్రంలో అమల్లోకి ఎన్నికల కోడ్
- నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ
- ఫిబ్రవరి 16న మేయర్, డిప్యూటీ మేయర్, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీంతో నేటి నుంచి ఎన్నికలు జరిగే పట్టణాల్లో ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది. జనవరి 30 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. జనవరి 31న స్క్రూట్నీ, ఫిబ్రవరి 3న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. ఫిబ్రవరి 11వ తేదీన ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. బ్యాలెట్ పద్దతిలోనే ఎన్నికలు జరగనున్నాయి. ఎక్కడైనా రీపోలింగ్ నిర్వహించాల్సివస్తే ఫిబ్రవరి 12న నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 13న ఫలితాలు ప్రకటించనున్నారు. ఫిబ్రవరి 16న 116 మున్సిపాలిటీల్లో ఛైర్‌ఫర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నిక, 7 కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక ఉండనుంది. షెడ్యూల్ విడుదల చేసిన అనంతరం ఎస్‌ఈసీ రాణి కుముదిని మాట్లాడుతూ మొత్తం 52,43,000 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు చెప్పారు. 2996 వార్డులకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ ఎన్నికలు పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలీస్ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి భద్రత కల్పిస్తామన్నారు. రేపటి నుంచి నామినేషన్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా, ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ఈ ఎన్నికలు అత్యంత కీలకంగా మారాయి. పట్టణ ఓటర్ల తీర్పు ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

### ముఖ్య తేదీలు

- నామినేషన్ల స్వీకరణ -జనవరి 28 నుంచి 30 వరకు
- నామినేషన్ల పరిశీలన -జనవరి 31
- నామినేషన్ల ఉపసంహరణ - ఫిబ్రవరి 3
- పోలింగ్ - ఫిబ్రవరి 11
- ఫలితాల వెల్లడి - ఫిబ్రవరి 13
- మేయర్, ఛైర్ పర్సన్‌ల ఎన్నిక - ఫిబ్రవరి 16

# ఢిల్లీలో చారిత్రక ఘట్టం

## - భారత్-ఈయూ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' ఖరారు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ఖరారైంది. 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత కుదిరిన ఈ ఒప్పందాన్ని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా, కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టాలతో జరిగిన 16వ శిఖరాగ్ర సమావేశంలో ఈ ఒప్పందాన్ని అధికారికంగా ఖరారు చేశారు. ఈ ఒప్పందం ద్వారా భారత్ నుంచి జరిగే 97 శాతం ఎగుమతులపై సుంకాలు రద్దు కానున్నాయి. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, రత్నాలు, లెదర్ వంటి రంగాలకు ఇది భారీ ఊతాన్ని ఇవ్వనుంది. అదే సమయంలో యూరప్ కార్లు, యంత్ర పరికరాలకు భారత మార్కెట్‌లోకి ప్రవేశం సులభతరం అవుతుంది. "యూరప్, భారత్ చరిత్ర సృష్టిస్తున్నాయి. మేం 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'ను ముగించాం. ఇరుపక్షాలకు ప్రయోజనం చేకూర్చేలా 200 కోట్ల మంది ప్రజలతో స్వేచ్ఛా

2లో..

# కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాల్లో
# మొదటి దెయ్యం సంతోష్ రావే

- రేవంత్ రెడ్డికి సంతోష్ రావు ప్రధాన ఇన్ఫార్మర్ అని కవిత ఆరోపణ
- కేసీఆర్ ఏం తిన్నారో కూడా చేరవేసే వ్యక్తి సంతోష్ అని తీవ్ర వ్యాఖ్య
- గద్దర్, ఈటల వంటి వారిని కేసీఆర్‌కు దూరం చేసింది సంతోషేనని విమర్శ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కేసీఆర్ పక్కన దెయ్యాల్లో మొదటి స్థానం సంతోష్ రావుదేనని కల్వకుంట్ల కవిత ఆరోపించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆమె ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు వచ్చిన సమయంలో సంతోష్ రావును టార్గెట్ చేశారు. కేసీఆర్ చుట్టూ ఒక ఇనుప గొలుసులా మారి, ఆయనను బాహ్య ప్రపంచానికి, చివరకు సొంత కుటుంబ సభ్యులకు కూడా దూరం చేసింది సంతోష్ రావేనని కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజా గాయకుడు గద్దర్ ప్రగతి భవన్ గేటు వద్ద గంటల తరబడి నిలబడినా లోపలికి రానివ్వలేదని, ఈటల రాజేందర్

2లో..

# ప్లాస్టిక్‌తో పెను ముప్పు..

2లో..

## 2040 నాటికి ఆరోగ్య సమస్యలు రెట్టింపు

### - లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం



# పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేద్దాం..
# పడగొట్టినవి నిలబెడదాం

## - సమీక్షలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం




అమరావతి (ప్రశ్న న్యూస్) రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను ప్రపంచంలోనే అతిపెద్ద ఉద్యానవన హబ్‌గా మార్చడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ గ్లోబల్ మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా 500 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన ఉత్పత్తుల సాధనే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ఉద్యాన రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆయన స్పష్టం చేశారు.

### 10 జిల్లాలను కేంద్ర బిందువుగా చేసుకుని ఉద్యాన సాగు

రాష్ట్రంలోని 10 జిల్లాలను కేంద్ర బిందువుగా చేసుకుని ఉద్యాన సాగు

2లో..

# రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై గవర్నర్‌కు ఫిర్యాదు

## - బొగ్గు కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సింగరేణి బొగ్గు కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి విజ్ఞప్తి చేశారు. కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం గవర్నర్‌ను కలిసి సింగరేణిలో బొగ్గు కుంభకోణం జరిగిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సింగరేణిలో దోపిడీ అంశంపై గవర్నర్?కు వినతిపత్రం ఇచ్చామని, ఆధారాలతో బయటపెట్టినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో వణుకు మొదలైందని అన్నారు. కుంభకోణాన్ని బహిర్గతం చేశాక అధికార పార్టీ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని అన్నారు. అందుకే ప్రజల దృష్టిని మరల్చేందుకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తీసుకువచ్చారని ఆరోపించారు. ఫుట్?బాల్ ఆటకు రూ. 10 కోట్ల సింగరేణి నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సీఎం అంటే కోల్ మాఫియా నాయకుడిగా సింగరేణి కార్మికులు భావించే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సింగరేణి టెండర్లలో పారదర్శకత లేదని అన్నారు. సింగరేణి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో కీలక వ్యక్తి సృజన్ రెడ్డి ముఖ్యమంత్రికి బావమరిదేనా, కాదా స్పష్టత ఇవ్వాలని డిమాండ్

2లో..

# పనితీరు బాగోకపోతే పదవులు ఊడతాయి

## - నేతలకు చంద్రబాబు వార్నింగ్



అమరావతి (ప్రశ్న న్యూస్) పార్టీ కంటే ఏదీ ముఖ్యం కాదని, ఏ నాయకుడైనా సరే నిర్లక్ష్యం వహించినా, వివాదాలు సృష్టించినా పక్కనబెట్టడానికి వెనుకాడబోనని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. అధికారం వచ్చిందన్న భావనతో ఎవరూ అలసత్వం ప్రదర్శించవద్దని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్లమెంట్ కమిటీల వర్క్?షాప్?లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నేతలకు దిశానిర్దేశం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. "పార్టీలో పదవులు పొందిన వారి పనితీరును ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తాను. సరిగా పనిచేయకపోతే వారిని తప్పించి, మరొకరికి అవకాశం కల్పిస్తాను. పార్టీలో తీసుకొస్తున్న మార్పులకు అనుగుణంగా నేతలు, కార్యకర్తల్లో కూడా మార్పు రావాలి. వచ్చిన అధికారాన్ని

2లో..

# చుక్కలనంటిన బంగారం, వెండి ధరలు

- 10 గ్రాముల బంగారం ధర రూ.1.66 లక్షలు
- కిలో వెండి ధర రూ.3.7 లక్షల మార్కు




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశీయ బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు మంగళవారం సరికొత్త చరిత్ర సృష్టించాయి. మునుపెన్నడూ లేని విధంగా జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరి, మదుపరులను, వినియోగదారులను ఆశ్చర్యపరిచాయి. మంగళవారం ట్రేడింగ్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ. 1.66 లక్షలకు చేరగా, కిలో వెండి ధర ఏకంగా

2లో..

# మేడారం జాతరకు సర్వం సిద్ధం

2లో..

- భక్తుల కోసం ప్రత్యేక బస్సులు, రైళ్లు,
## అందుబాటులో హెలికాప్టర్ సేవలు



# ఉప ముఖ్యమంత్రితో మంత్రులు సమావేశం కాకూడదా.?

2లో..

## - సీఎం అందుబాటులో లేనందున తనతో చర్చించేందుకు వచ్చారని స్పష్టీకరణ



# కార్పొరేట్ విద్యా సంస్థలు దొంగలు

- సరైన విద్య అందితేనే పేదల సమస్యలు తీరుతాయన్న మంత్రి
- విద్యార్థులకు స్కిల్స్ లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్య
- నేనే విద్యాశాఖ మంత్రిని అయితే వాటిని బంద్ చేస్తా
- మంత్రి కోమటిరెడ్డి సంచలన ప్రకటన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి పదేళ్లలో నీళ్లు, నిధులు, నియామకాల లక్ష్యం నెరవేరలేదని, ప్రజల సమస్యలు అలాగే ఉండిపోయాయని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నల్లగొండ పట్టణంలోని బొట్టుగూడలో కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ. 8 కోట్ల వ్యయంతో పునర్నిర్మించిన ప్రభుత్వ

2లో..

# ఢిల్లీలో చారిత్రక ఘట్టం

వాణిజ్య క్షేత్రాన్ని సృష్టించాం" అని ఉర్సులా 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఈ ఒప్పందం రెండు ప్రపంచ దిగ్గజాల మధ్య భాగస్వామ్యానికి చక్కటి ఉదాహరణ అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వాణిజ్యంతో పాటు రక్షణ, భద్రత, వాతావరణ మార్పులు, కీలక సాంకేతికతలు వంటి అంశాలపై కూడా ఇరుపక్షాలు దృష్టి సారించాయి. అమెరికా, చైనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, ఇతర ప్రాంతాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని చూస్తున్న ఐరోపాకు ఈ ఒప్పందం వ్యూహాత్మకంగా చాలా కీలకం. ఈ ఒప్పందం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుందని అంచనా వేస్తున్నారు.

## కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాల్లో

# మొదటి దెయ్యం సంతోష్ రావే

వంటి ఉద్యమ నేతలు పార్టీ వీడటానికి కూడా ఆయనే ప్రధాన కారణమని ఆమె మండిపడ్డారు. కేసీఆర్?ను అందరి నుంచి ఐసోలేట్ చేసి, పార్టీకి అత్యంత నష్టం కలిగించిన వ్యక్తిగా సంతోష్ రావును ఆమె అభివర్ణించారు. సంతోష్ రావు ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇన్ఫార్మర్ గా వ్యవహరిస్తున్నారని కవిత చేసిన ఆరోపణ అత్యంత చర్చనీయాంశంగా మారింది. కేసీఆర్ వ్యక్తిగత విషయాలను, ఆయన ఆహారపు అలవాట్ల నుండి రాజకీయ వ్యూహాల వరకు ప్రతి చిన్న విషయాన్ని రేవంత్ రెడ్డికి చేరవేస్తున్నారని ఆమె ఎద్దేవా చేశారు. కేసీఆర్ అర ఇడ్లీ తిన్నారా పూర్తి ఇడ్లీ తిన్నారా అన్న విషయాన్ని కూడా చేరవేస్తారన్నారు. సంతోష్ రావు కేవలం రాజకీయంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా కేసీఆర్ పరువు తీసేలా వ్యవహరిస్తున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి చుట్టూ ఉన్న కోటరీని బద్దలు కొట్టాల్సిన సమయం వచ్చిందని, అందుకే ఇలాంటి వ్యక్తుల అసలు స్వరూపాన్ని బయటపెడుతున్నట్లు ఆమె స్పష్టం చేశారు.సంతోష్ రావు వల్ల కేవలం పార్టీకే కాదు, కుటుంబానికి కూడా తీరని నష్టం జరిగిందని కవిత మాటల్లో స్పష్టమవుతోంది. కవితకు, కేసీఆర్‌కు మధ్య దూరం పెరగడానికి, తండ్రీకూతుళ్ల మధ్య తప్పుడు సమాచారంతో చిచ్చు పెట్టడానికి సంతోష్ రావు నిరంతరం ప్రయత్నించారని ఆమె ఆరోపిస్తున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ సమయంలో కూడా తనకు ఆశించిన స్థాయిలో పార్టీ నుంచి మద్దతు లభించకపోవడం వెనుక సంతోష్ రావు హస్తం ఉందని కవిత గట్టిగా నమ్ముతున్నట్లు తెలుస్తోంది. అయితే కవిత ఆరోపణలు బీఆర్ఎస్ అగ్రనేతల్లో పెద్దగా కదలిక సృష్టించడం కష్టమని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కవిత ఇప్పటికే సొంత పార్టీ ప్రయత్నాల్లో ఉన్నారు. బీఆర్ఎస్ ను బలహీనం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని అందులో భాగంగా నే హరీష్ రావు, సంతోష్ రావులను టార్గెట్ చేస్తున్నారని అనుమానిస్తున్నారు. వారి ట్రాప్ లో పడకూడదని పార్టీ ముఖ్యులు, ఎవరూ ఇలాంటి అంశాలపై స్పందించవద్దని సంకేతాలు ఇస్తున్నట్లుగా తెలుస్తోంది.

# ప్లాస్టిక్‌తో పెను ముప్పు..

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికే కాకుండా, మానవ ఆరోగ్యానికి కూడా తీవ్ర ముప్పు పొంచి ఉందని తాజా అధ్యయనం ఒకటి హెచ్చరించింది. ప్రస్తుత పద్ధతుల్లో ఎటువంటి మార్పులు తీసుకురాకపోతే 2040 నాటికి ప్లాస్టిక్ వ్యవస్థ నుంచి వెలువడే ఉద్గారాల వల్ల ఆరోగ్య సమస్యలు రెట్టింపు అయ్యే ప్రమాదం ఉందని, ప్రచురితమైన ఈ అధ్యయనం స్పష్టం చేసింది. ఈ పరిశోధన వివరాలు ప్రతిష్ఠాత్మక 'ది లాన్సెట్ ప్లానెటరీ హెల్త్' జర్నల్?లో ప్రచురితమయ్యాయి. ప్లాస్టిక్ తయారీకి ముడిసరుకులైన శిలాజ ఇంధనాల వెలికితీత నుంచి, ఉత్పత్తి, వినియోగం, పారవేయడం వరకు ప్రతి దశలోనూ ఆరోగ్యానికి హాని కలుగుతున్నట్లు ఈ అధ్యయనం గుర్తించింది. గ్రీన్?హౌస్ వాయువులు, గాలిని కలుషితం చేసే కణాలు, విష రసాయనాలు ప్రధానంగా ప్లాస్టిక్ ఉత్పత్తి ప్రక్రియల నుంచే విడుదలవుతున్నాయని తెలిపింది. ప్రస్తుత విధానాలే కొనసాగితే, 2040 నాటికి ప్లాస్టిక్ వల్ల కలిగే ఆరోగ్య నష్టాల్లో 40 శాతం గ్రీన్?హౌస్ వాయువుల వల్ల, 32 శాతం వాయు కాలుష్యం వల్ల, 27 శాతం విష రసాయనాల వల్ల సంభవిస్తాయని పరిశోధకులు అంచనా వేశారు. లండన్ స్కూల్?కు చెందిన పరిశోధకురాలు మేగన్ డీనీ మాట్లాడుతూ "ప్లాస్టిక్ జీవిత చక్రంలో వెలువడే ఉద్గారాలు క్యాన్సర్లు, ఇతర అసంక్రమిత వ్యాధులకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా ప్లాస్టిక్ ఉత్పత్తి, దానిని బహిరంగంగా కాల్చడం వల్లే ఎక్కువ హాని జరుగుతోంది" అని వివరించారు. కేవలం వ్యర్థాల సేకరణ, రీసైక్లింగ్ మెరుగుపరచడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని, దీనికి బదులుగా అనవసరమైన ప్లాస్టిక్ ఉత్పత్తిని గణనీయంగా తగ్గించి, కఠిన నిబంధనలు అమలు చేయాలని పరిశోధకుల బృందం ప్రభుత్వాలకు సూచించింది.

# పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేద్దాం.. పడగొట్టినవి నిలబెడదాం

విస్తీర్ణాన్ని వచ్చే మూడేళ్లలో 8.41 లక్షల హెక్టార్ల నుంచి 14.41 లక్షల హెక్టార్లకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. దుబాయ్‌కు చెందిన దిగ్గజ సంస్థ 'డీపీ వరల్డ్' ఏపీలో ఉద్యాన క్లస్టర్ ఏర్పాటుకు ఆసక్తి చూపడంపై సీఎం హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని, ఇందులో భాగంగా గ్రామీణ రహదారుల నెట్‌వర్క్, లాజిస్టిక్స్, మార్కెట్ కనెక్టివిటీ మరియు కోల్డ్ చైన్ నిల్వ కేంద్రాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రులు, అధికారులకు సూచించారు.

### 20కి పైగా కీలక ప్రాజెక్టులు ప్రాధాన్యత క్రమంలో పూర్తి

నీటిపారుదల రంగాన్ని బలోపేతం చేసే దిశగా 10 జిల్లాల్లో పెండింగ్?లో ఉన్న 20కి పైగా కీలక ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టును ఈ ఏడాదిలోనే పూర్తి చేయాలని, గత ప్రభుత్వ వైఫల్యం వల్ల కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టును పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. హంద్రీ-నీవా, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టుల ద్వారా కృష్ణా జలాలను రాయలసీమ చిట్టచివరి భూములకు అందించాలని, ఈ ప్రాజెక్టుల వల్ల కొత్తగా 8.87 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని అధికారులు వెల్లడించారు.

### గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించి పోలవరం-వంశధార నదుల అనుసంధానం

ఉత్తరాంధ్ర అభివృద్ధిని కూడా సమాంతరంగా ముందుకు తీసుకెళ్తామని, పోలవరం కుడి కాలువ పనులు పూర్తయిన వెంటనే గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించి పోలవరం-వంశధార నదుల అనుసంధానం చేపడతామని సీఎం వెల్లడించారు. పూర్వోదయ మరియు రాష్ట్ర ప్రభుత్వ నిధులను సమన్వయం చేసుకుంటూ, ప్రైవేట్ పెట్టుబడులను కూడా ప్రోత్సహించి రాష్ట్రాన్ని వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అగ్రపథాన నిలపాలని ఆయన పిలుపునిచ్చారు.

# చుక్కలనంటిన బంగారం, వెండి ధరలు

రూ.3.7 లక్షలు పలికింది. వివరాల్లోకి వెళితే, సోమవారం ముగింపు ధర రూ.1,58,700తో పోలిస్తే, 10 గ్రాముల బంగారంపై ఒక్కరోజే రూ.7,300 (4.6 శాతం) పెరిగింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఫిబ్రవరి ఫ్యూచర్స్ ట్రేడింగ్ సమయంలో రూ.1,59,820 వద్ద ఆల్ టైమ్ రికార్డును నమోదు చేసింది.బంగారం బాటలోనే వెండి కూడా పరుగులు పెట్టింది. ఎంసీఎక్స్‌లో మార్చి ఫ్యూచర్స్ కిలోకు రూ.3,64,000 మార్కును దాటగా, రిటైల్ మార్కెట్లో ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయి.

ముంబై, ఢిల్లీలలో కిలో వెండి ధర రూ.3.7 లక్షలు ఉండగా, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో ఇది రూ.3,87,000 వరకు పలికింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి వల్లే ఈ ధరల పెరుగుదల చోటుచేసుకుందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడిదారులు బంగారం, వెండిని 'సేఫ్-హెవెన్' ఆస్తులుగా భావించి భారీగా కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 5,100 డాలర్ల రికార్డు స్థాయిని దాటడం కూడా దేశీయ ధరలపై ప్రభావం చూపింది. ఈ రికార్డు ధరలతో మార్కెట్లో తీవ్రమైన కదలికలు కనిపిస్తుండగా, మదుపరులు తదుపరి పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తున్నారు.

# శిక్షణ టీచర్లకు ఈఎల్స్ మంజూరు చేయాలి

**- డీఈఓకు తపస్ నేతల వినతి**

**జగిత్యాల,** ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణలో పాల్గొన్న వారికి ఈఎల్స్ మంజూరు చేయాలనీ తపస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు బోయినపల్లి ప్రసాద్ రావు కోరారు.మంగళవారం జగిత్యాల జిల్లా విద్యాధికారికీ తపస్ నేతలు ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి కొక్కుల రాజేష్ తదితరులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్బంగా ప్రసాద్ రావు, రాజేష్ లు మాట్లాడుతూ2025 వేసవి సెలవుల్లో ప్రభుత్వం జగిత్యాల జిల్లా ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కార్యక్రమం నిర్వహించిందని వారు తెలిపారు.అయితే శిక్షణలో పాల్గొన్న టీచర్లందరికి ఈఎల్స్ మంజూరు చేయాలనీ, ఇట్టి విషయంలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులకు తగు సూచనలు చేయాలనీ తపస్ నేతలు డీఈఓ ను కోరారు.ఈకార్యక్రమంలో తపస్ జిల్లా బాధ్యులు రఘునందన్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పనితీరు బాగోకపోతే పదవులు ఊడతాయి

నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని చంద్రబాబు స్పష్టం చేశారు. పొలిటికల్ గవర్నెన్స్?లో పార్లమెంట్ కమిటీలు కీలకమని, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు కూడా పార్లమెంట్ అధ్యక్షులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలతో కలిసికట్టుగా పనిచేయాలని, 2024 ఎన్నికల్లో కూటమికి వచ్చిన ఓట్ల కంటే మరో పది ఓట్లు అదనంగా వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వివాదాస్పద ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్?ను రద్దు చేసి మాట నిలబెట్టుకున్నామని తెలిపారు. "ప్రజల భూముల పట్టాదారు పాసుపుస్తకాలపై, పొలం సరిహద్దు రాళ్లపై కూడా వాళ్ల ఫొటోలు ముద్రించుకున్నారు. చరిత్రలో ఎప్పుడైనా ఇలా జరిగిందా? ప్రజల ఆస్తుల జుట్టు వాళ్ల చేతుల్లో పెట్టుకుని ఆడించాలని చూశారు. అందుకే ఆ లోపభూయిష్టమైన చట్టాన్ని రద్దు చేశాం. ఏడాదిలోగా మళ్లీ సర్వేలు చేసి, ఎలాంటి సమస్యలు లేని పట్టాదారు పుస్తకాలు అందిస్తాం" అని హామీ ఇచ్చారు. అమరావతి విషయంలో గత ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడిందని, ఇప్పుడు మళ్లీ తాము రాజధానికి జీవం పోశామని అన్నారు. అమరావతే ఏకైక రాజధాని అని స్పష్టం చేస్తూనే, అన్ని ప్రాంతాల అభివృద్ధి తమ ధ్యేయమని, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని పునరుద్ఘాటించారు. భోగాపురం విమానాశ్రయంలో 500 ఎకరాలు కొట్టేయాలని చూశారని, పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారని ఆరోపించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని ఎద్దేవా చేశారు.

### కార్యకర్తే అధినేత.. వారికి అండగా ఉండాలి

పార్టీలో కార్యకర్తే అధినేత అని, వారికి న్యాయం జరిగినప్పుడే పార్టీ శాశ్వతంగా ఉంటుందని చంద్రబాబు అన్నారు. గత ఐదేళ్లలో కార్యకర్తలు ఎన్నో కష్టాలు పడ్డారని, పసుపు జెండా కోసం రక్తం చిందించారని గుర్తుచేశారు. "ఏ పని జరిగినా కార్యకర్తలకు గుర్తింపు ఉండాలి. నాయకులెవరూ కేడర్‌ను విస్మరించవద్దు. వారితో నిరంతరం అనుసంధానమై ఉండాలి" అని ఎమ్మెల్యేలు, ఎంపీలకు సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. "మనం చేసే పనులు ఎంత ముఖ్యమో, మనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టడం కూడా అంతే ముఖ్యం. సోషల్ మీడియాలోనే కాదు, మౌత్ టు మౌత్ పబ్లిసిటీతో ప్రజలకు వాస్తవాలు వివరించాలి," అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సూపర్ 6 హామీలను సూపర్ హిట్ చేశామని, డీఎస్సీ, పోలీస్ ఉద్యోగాల భర్తీతో పాటు రోడ్ల మరమ్మతులు వేగవంతం చేశామని వివరించారు. రాబోయే అన్ని ఎన్నికల్లోనూ కూటమి గెలిచేలా ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని కోరారు.

# రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై గవర్నర్‌కు ఫిర్యాదు

చేశారు. సింగరేణి కుంభకోణాన్ని అడ్డుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు చెప్పారు. రేవంత్ రెడ్డి సోదరులకు ఇదివరకే దోచుకున్నది సరిపోక, హిల్ట్ పాలసీ పేరుతో హైదరాబాద్‌లోని పారిశ్రామిక వాడల్లోని రూ.5 లక్షల కోట్ల విలువైన 9,200 ఎకరాల భూములను కొల్లగొట్టే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి కుంభకోణం, హిల్ట్ పాలసీ వంటి ప్రజాధనాన్ని కొల్లగొట్టే ప్రయత్నాలను అడ్డుకోవాలని గవర్నర్‌ను కోరామని అన్నారు.

# మేడారం జాతరకుసర్వం సిద్ధం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర, మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర నేడు ప్రారంభం కానుంది. ములుగు జిల్లాలోని మేడారం గ్రామంలో జరిగే ఈ నాలుగు రోజుల వేడుకకు దేశం నలుమూలల నుంచి సుమారు రెండు కోట్లకు పైగా భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్?కు దాదాపు 240 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గిరిజన పుణ్యక్షేత్రం ఇప్పటికే జనసంద్రంగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్?గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా సహా పలు రాష్ట్రాల నుంచి గిరిజనులు, గిరిజనేతరులు ఈ జాతరకు పోటెత్తుతున్నారు. ఇప్పటికే గత కొద్ది రోజులుగా దాదాపు 10 లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. వనదేవతలైన సమ్మక్క, సారలమ్మల వీరత్వాన్ని, త్యాగాన్ని స్మరించుకుంటూ రెండేళ్లకోసారి ఈ జాతరను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.

### ప్రభుత్వం భారీ ఏర్పాట్లు

ఈ ఏడాది జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 251 కోట్లు ఖర్చు చేసింది. 21 శాఖలకు చెందిన 42,000 మందికి పైగా అధికారులు, సిబ్బందిని, 2000 మంది ఆదివాసీ వాలంటీర్లను భక్తుల సేవ కోసం నియమించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా 13,000 మంది పోలీసులను మోహరించారు. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత డ్రోన్లతో జాతరను పర్యవేక్షిస్తున్నారు. 1,418 ఎకరాల్లో 42 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. జంపన్న వాగు వద్ద 200 మంది గజ ఈతగాళ్లను, 30 వైద్య శిబిరాల్లో 5,192 మంది వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పారిశుద్ధ్యం కోసం 5,000 మంది కార్మికులు, 5,700 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. భక్తుల రవాణా కోసం టీజీఎస్ఆర్టీసీ 4,000 ప్రత్యేక బస్సులను, దక్షిణ మధ్య రైల్వే 28 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. పర్యాటక శాఖ హనుమకొండ నుంచి మేడారానికి హెలికాప్టర్ సేవలను కూడా అందిస్తోంది. రౌండ్ ట్రిప్?తో కూడిన వీఐపీ దర్శనానికి రూ. 35,999, జాతర ఏరియల్ వ్యూ కోసం ఒక్కొక్కరికి రూ. 4,800 చొప్పున ఛార్జీలను నిర్ణయించారు.

### జాతర నేపథ్యం, సంప్రదాయాలు

కాకతీయ పాలకుల పన్నుల విధానాన్ని ఎదిరించి పోరాడిన గిరిజన వీరవనితలు సమ్మక్క, ఆమె కుమార్తె సారక్క (సారలమ్మ)ల శౌర్యాన్ని స్మరించుకుంటూ ఈ జాతరను నిర్వహిస్తారు. కోయ తెగకు చెందిన ఈ తల్లీకూతుళ్లను గిరిజనులు దేవతలుగా కొలుస్తారు. పోరాటంలో అలసిపోయిన సమ్మక్క చిలుకలగుట్ట వైపు వెళ్లి అదృశ్యమయ్యిందని, ఆమె కోసం వెతికిన గిరిజనులకు ఓ వెదురు చెట్టు కింద కుంకుమ భరిణె మాత్రమే లభించిందని స్థానిక కథనం. అప్పటి నుంచి రెండేళ్లకోసారి గిరిజన పూజారులు వెదురు వనంలో ప్రత్యేక పూజలు చేసి, కుంకుమ భరిణె, ఎర్రటి వస్త్రం చుట్టిన వెదురు కర్రను సమ్మక్క ప్రతిరూపంగా భావించి గద్దెల వద్దకు తీసుకువస్తారు. అంతకుముందు రోజు కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్ఠించడంతో జాతర అధికారికంగా మొదలవుతుంది. భక్తులు తమ బరువుకు సమానమైన బెల్లాన్ని (బంగారం) అమ్మవార్లకు సమర్పిస్తారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించడం ఇక్కడి ముఖ్యమైన సంప్రదాయం.

## ఉప ముఖ్యమంత్రితో మంత్రులు

# సమావేశం కాకూడదా.?

**- సీఎం అందుబాటులో లేనందున తనతో చర్చించేందుకు వచ్చారని స్పష్టీకరణ**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో ఉండగా, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ సోమవారం రాత్రి సమావేశం కావడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ భేటీపై మల్లు భట్టి విక్రమార్క స్పందించారు. ఉప ముఖ్యమంత్రితో మంత్రులు సమావేశం కాకూడదా అని ఆయన ప్రశ్నించారు. మంత్రులు తనతో భేటీ కావడం సాధారణ విషయమేనని ఆయన స్పష్టం చేశారు. ఇది పాలనాపరమైన అంశాలపై జరిగిన సమావేశమని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి అందుబాటులో లేనందున మంత్రులు ఉప ముఖ్యమంత్రిగా తనతో చర్చించేందుకు వచ్చారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు అందరూ కలిసి ఒక ఉమ్మడి కుటుంబంలా పనిచేస్తున్నామని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో ఈ భేటీ జరగడం చర్చకు దారి తీసిందని మీడియా ప్రతినిధి ప్రశ్నించగా, మల్లు భట్టి విక్రమార్క స్పందిస్తూ, కొందరు పిచ్చివాళ్లు ఏవేవో మాట్లాడుతుంటారని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు.

### అసలేం జరిగిందంటే.?

హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సోమవారం రాత్రి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తుతం దేశంలో లేని సమయంలో నలుగురు మంత్రులు సమావేశం కావడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది.

లోక్‌భవన్‌లో గవర్నర్ నిర్వహించిన 'ఎట్ హోం' కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మంత్రులు అక్కడ నుండి నేరుగా ప్రజాభవన్‌కు వెళ్లారు. సీఎం రేవంత్ అమెరికాలో లీడర్ షిప్ కోర్సు చేసేందుకు వెళ్లిన సమయంలో మంత్రులు భేటీ కావడంతో ఏదో జరుగుతోందని ప్రచారం ప్రారంభమయింది. దీనిపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కూడా స్పందించారు. రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో నలుగురు మంత్రులు సమావేశం కావడంలో ఆశ్చర్యం లేదన్నారు. సీఎం అందుబాటులో లేనప్పుడు పాలనాపరమైన అంశాలపై మంత్రులు చర్చించుకోవడంలో తప్పులేదన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సజావుగా సాగడానికి మంత్రుల మధ్య సమన్వయం అవసరం. అందులో భాగంగానే భట్టితో ముగ్గురు మంత్రులు భేటీ అయ్యారని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై భట్టి విక్రమార్క క్లారిటీ ఇవ్వడంతో ఈ ప్రచారానికి తెరపడినట్లయింది.

# కార్పొరేట్ విద్యా సంస్థలు దొంగలు

ప్రాథమిక పాఠశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కార్పొరేట్ విద్యా సంస్థలపై నిప్పులు చెరిగారు. సమాజంలో పేదరికం పోవాలన్నా, సమస్యలు తీరాలన్నా నాణ్యమైన విద్య ఒక్కటే మార్గమని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఏటా విద్యా రంగంపై వేల కోట్లు ఖర్చు చేస్తోందని, అయితే ఆ ఫలితాలు ఆశించిన స్థాయిలో అందడం లేదని పేర్కొన్నారు. తన కుమారుడు ప్రతీక్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన ఈ పాఠశాలను దేశానికే ఒక 'మోడల్ స్కూల్'గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఆధునిక హంగులు, కంప్యూటర్ ల్యాబ్?లు, డిజిటల్ బోర్డులు, క్రీడా ప్రాంగణాలతో నిర్మితమైన ఇటువంటి ప్రభుత్వ పాఠశాల దేశంలో మరెక్కడా ఉండదని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ప్రైవేటు విద్యా సంస్థల తీరుపై మంత్రి కోమటిరెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'శ్రీచైతన్య, నారాయణ వంటి సంస్థలు విద్యా వ్యాపారం చేస్తూ దొంగలుగా మారాయి' అని ఆయన మండిపడ్డారు. అడ్మిషన్ల సీజన్ వస్తే ఆ ఫీజుల దోపిడీ చూస్తుంటే భయం వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు లక్షల ఫీజును రికమెండేషన్?తో రెండు లక్షలకు తగ్గిస్తామని చెప్పడం పెద్ద మాయాజాలమని, అసలు ఆ సంస్థల ఫీజులే అత్యధికమని విమర్శించారు. చట్టప్రకారం ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలని ఉన్నా కార్పొరేట్ శక్తులు ఆ చట్టాలను తుంగలో తొక్కి సామాన్యుల రక్తాన్ని పీలుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో బీఈడీ, టెట్, డీఎస్సీ రాసిన మేధావులైన ఉపాధ్యాయులు ఉంటే ప్రైవేటు సంస్థల్లో అరకొర చదువులు చదివిన వారితో బోధన చేయిస్తున్నారని మంత్రి ఎద్దేవా చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థలు కేవలం బట్టీ పద్ధతిని ప్రోత్సహిస్తున్నాయని, దీనివల్ల విద్యార్థుల్లో మార్కులు వస్తున్నా ఉద్యోగాలకు కావాల్సిన నైపుణ్యాలు ఉండటం లేదన్నారు. ఉన్నత చదువుల ఒత్తిడిని తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటానికి ఈ కార్పొరేట్ సంస్కృతే కారణమని అన్నారు. 'నాకు గనుక విద్యాశాఖ మంత్రిగా అవకాశం వస్తే ఈ కార్పొరేట్ దోపిడీ సంస్థలన్నింటినీ వెంటనే బంద్ చేయిస్తా' అని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి ఈ సందర్భంగా కోరారు.

## మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

# తాటిపర్తి శోభారాణి

**బతికేపల్లిలో ఉపాధిహామీ మహిళా కూలీలతో సమావేశం**




**జగిత్యాల,** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని పునరుద్దరించాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి శోభారాణి అన్నారు. జగిత్యాలజిల్లాలోని పెగడపల్లి మండలం బతికేపల్లి గ్రామంలో ఉపాధి హామీ వర్కర్స్ తో మంగళవారం మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి శోభారాణి అధ్యక్షతన సమావేశం జరుగగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి,పెగడపల్లి మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సింగసాని విజయలక్ష్మి లు హాజరయ్యారు. ఈ సందర్బంగా శోభారాణి మహిళా కూలీలనుద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం మహాత్మా గాంధీ పేరును తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడం సరైన నిర్ణయం కాదన్నారు. మహాత్మా గాంధీ మన దేశానికి స్వాతంత్రం తెచ్చిన గొప్ప మహనీయుడని ఆమే కొనియాడారు.ఉపాధిహామీ పథకానికి గాంధీ పేరు లేకుండా చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తునీదని శోభారాణిలు ఆరోపించారు. ఎంతోకాలంగా దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాల ఫలితంగా ఎంజిఎన్ఆర్ఇజిఎఎస్ రూపుదిద్దుకుందని,ప్రతి చేతికి పని, పనికి తగ్గ వేతనం అనే హామీ ఈ పథకం ద్వారా ప్రజలకు సిద్ధించినీదని శోభారాణి తెలిపారు.గ్రామీణ భారతంలో పని కోరుకునే వారికి చట్టబద్ధమైన హక్కును కల్పించిందని ఆమే గుర్తు చేశారు.దేశవ్యాప్తంగా 100 రోజులు ఉపాధికి కూలీలకు భరోసా కల్పిస్తూ హామీ ఇచ్చిందని, వికేంద్రీకృత పాలనను బలోపేతం చేసిందని శోభారాణి ఉద్ఘాటించారు. మహిళలు, భూమిలేని నీరుపేదలను శక్తివంతం చేసిందని ఆమే కొనియాడారు. ఇంతటి మహోన్నత పథకానికి జాతిపిత మహాత్మా గాంధీ పేరు పెడితే ఓర్వలేని బిజెపి ప్రభుత్వం, అయన పేరును తొలగించాలని నిర్ణయం తీసుకొని, గాంధీజీ పేరు మార్పు, విలువల పట్ల ఉన్న దీర్ఘకాల అసౌకర్యాన్ని ఆ నమ్మకాన్ని ప్రతిబింబించేలా చేస్తుందని శోభారాణి ఆరోపించారు.ప్రజాకేంద్రిత సంక్షేమ చట్టంతో జాతిపితకు ఉన్న అనుబంధాన్ని తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆమె దుయ్యాబట్టారు.కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడానికి బిల్లులను ప్రవేశ పెట్టడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు.ఉద్దేశ పూర్వకమైన అడుగు వేసింది చరిత్రత్మకమైన హక్కుల ఆధారిత ప్రజల చట్టాన్ని బలహీనపరచడం భారతదేశంలో అత్యంత గుర్తింపు పొందిన సంక్షేమ చట్టం నుండి మహాత్మా గాంధీ పేరు విలువలను తొలగించేందుకు చేసిన రాజకీయ కుట్ర అని ఆమె విమర్శించారు.అనాలోచిత నిర్ణయాలతో కేంద్రం వ్యవహరించడం ప్రజా వ్యతిరేకమని శోభారాణి పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ పక్షాన కేంద్రం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని శోభారాణి డిమాండ్ చేశారు. తదుపరి మహిళలతో మాట్లాడి కేంద్రం కుట్ర పూరిత ధోరణి వివరించి, కూలీల ఇబ్బంది, సమస్యలను శోభారాణి, విజయలక్ష్మి లు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బతికేపల్లి సర్పంచ్ ముంజ మహేశ్వరి మధుకర్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు సింగసాని విజయలక్ష్మి, మహిళల పాల్గొన్నారు.

# మేడారం మహా జాతర పోస్టర్ ఆవిష్కరణ



**జగిత్యాల** జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ లో మేడారం మహా జాతర పోస్టర్ ను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆవిష్కరించారు.సమ్మక్క, సారలమ్మ వన దేవతల మేడారం మహా జాతర జనవరి 28 నుండి 31 వరకు జరగనున్న నేపథ్యంలో దర్శనాలకు వచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.జిల్లా నుండి ఆర్.టి.సి బస్ లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.వన దేవతల దర్శనాలకు వెళ్లే భక్తులు జాగ్రత్తగా వెళ్లి భక్తి శ్రద్ధలతో దేవతల కృప పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి కె. రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక తల్లి చెప్పే మాటే కుటుంబ ప్రాణాలకు కవచం

**- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి,**

**వనపర్తి** అలైవ్అరైవ్' కార్యక్రమంలో భాగంగా 10వ రోజు అవగాహన కార్యక్రమం స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు రోడ్డు భద్రతపై అవగాహన 65 హెల్మెట్లు పంపిణీ చేసిన అయ్యప్ప రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ పాత్రికేయులు, పోలీసులకు, మహిళలకు హెల్మెట్ల పంపిణీరోడ్డు ప్రమాదాల నివారణలో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని వనపర్తి జిల్లా సునిత రెడ్డి,, అన్నారు. పెద్దమందడి జనవరి -27 రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అలైవ్ అరైవ్" కార్యక్రమంలో భాగంగా 10వ రోజు మంగళవారం ఉదయం పెద్దమందడి మండల కేంద్రంలోని రైతువేదికలో, అయ్యప్ప రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలు, పాత్రికేయులు, పోలీసులకు హెల్మెట్ ప్రాముఖ్యత మరియు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం అయ్యప్ప రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ వారి సహకారంతో 65 హెల్మెట్లను పాత్రికేయులు, పోలీస్ సిబ్బంది, మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కుటుంబంలో పిల్లలు, భర్తలు, అన్నదమ్ములు సురక్షితంగా ఇంటికి చేరాలంటే మహిళలు వారికి హెల్మెట్ వినియోగంపై నిరంతరం గుర్తుచేయాలన్నారు. హెల్మెట్ ధరించడం చట్టబద్ధమైన నిబంధన మాత్రమే కాకుండా, కుటుంబ ఆనందాన్ని కాపాడే భద్రతా కవచమని మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామస్థాయిలో రోడ్డు భద్రత సందేశాన్ని విస్తరించాలని, తమ కుటుంబాలతో పాటు సమాజాన్ని కూడా ప్రమాదాల నుంచి రక్షించాలన్నారు. అమ్మ మాటలోనే భద్రత ఉంది భార్య సూచనలోనే భర్త జీవితం ఉంది పిల్లల చిరునవ్వుల కోసం హెల్మెట్ తప్పనిసరని హెల్మెట్ ధరించమని అడగడం హెల్మెంట్ ధరించకుండా వెళ్లనివ్వడం ప్రమాదమని. రెండు చక్రాల వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, అది చట్టపరమైన నిబంధన మాత్రమే కాకుండా కుటుంబ ప్రాణాలను కాపాడే భద్రతా కవచమని అన్నారు. మహిళలు తమ భర్తలు, పిల్లలు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపకుండా కచ్చితంగా గుర్తుచేయాలని, అదే నిజమైన కుటుంబ బాధ్యతని భర్త బయటకు వెళ్లేటప్పుడు హెల్మెట్ ఉందా అని అడగడం భార్య ప్రేమపిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించడం తల్లి బాధ్యతని హెల్మెట్ ధరించమని చెప్పడం ఒక మాట కాదు కుటుంబాన్ని ప్రమాదాల నుంచి కాపాడే భద్రతని ఎస్పీ అన్నారు.

# యువగళం పాదయాత్రకు మూడేళ్లు

ఐటీ & విద్యాశాఖ మంత్రినారా లోకేష్ ప్రారంభించిన చారిత్రక యువగళం పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా, ఈ రోజు వరసిద్ధి వినాయక స్వామి వారి అఖిలాండం వద్ద శాప్ చైర్మన్ రవి నాయుడు 116 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న విపత్కర పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటికి శాశ్వత పరిష్కార మార్గాలు చూపాలనే సంకల్పంతోనే నారా లోకేష్ యువగళం పాదయాత్రను ప్రారంభించారని తెలిపారు. ప్రజల కష్టాలను వినడమే కాకుండా, వాటిని విధానాలుగా మార్చి అమలు చేయడమే యువగళం పాదయాత్ర ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జనవరి 27, 2023న కుప్పం నుండి యువగళం పాదయాత్రకు తొలి అడుగు వేసిన నారా లోకేష్ , అదే రోజున కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకుని, ఎదురయ్యే అన్ని అడ్డంకులు తొలగించాలని ప్రార్థిస్తూ ఈ మహత్తర యాత్రకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. పాదయాత్ర సమయంలో భీమవరం, నూజివీడు వంటి ప్రాంతాల్లో అనేక అవరోధాలు సృష్టించారని, యువగళం వాలంటీర్లపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసి అర్ధరాత్రి అరెస్టులు చేసిన సంఘటనలు కూడా జరిగాయని తెలిపారు. ఆ క్లిష్ట సమయంలో స్వామివారిని ప్రార్థించి, పాదయాత్ర విజయవంతంగా పూర్తై ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మొక్కు చెల్లించుకుంటామని మనస్ఫూర్తిగా సంకల్పించామని అన్నారు. అలాగే 226 రోజులు ? 3132 కిలోమీటర్లు సాగిన యువగళం పాదయాత్ర, ప్రజల ఆశీర్వాదంతో విజయవంతంగా పూర్తవడం ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో నిలిచిపోయే ఘట్టమని అన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ తనను తాను ప్రజానాయకుడిగా మలుచుకుని, అనేక అగ్నిపరీక్షలను ఎదుర్కొంటూ నాయకత్వ సామర్థ్యాన్ని చాటుకున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడురి అక్రమ అరెస్టు నేపథ్యంలో పార్టీని ఏకతాటిపై నిలబెట్టి ముందుకు నడిపించిన యువనేతగా లోకేష్ గారు నిలిచారని, యువగళం పాదయాత్రతో ఆయన ప్రజానాయకుడిగా మరింత రాటుతేలారని రవి నాయుడు వ్యాఖ్యానించారు. యువగళం పాదయాత్ర ఒక నవ రాజకీయ శకానికి నాంది పలికిందని అన్నారు. యువగళం పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు మెగా డీఎస్సీ పూర్తి చేయడం, 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగడం, వెళ్లిపోయిన పరిశ్రమలను తిరిగి రాష్ట్రానికి తీసుకురావడం, బంగారుపాలెం వంటి ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు అమలులోకి రావడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. భవిష్యత్తులో పార్టీని బలంగా, బాధ్యతాయుతంగా నడిపించే శక్తి, సామర్థ్యం నారా లోకేష్ గారికే ఉందని రవి నాయుడు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం చైర్మన్ మని నాయుడు,ఐరాల మండల అధ్యక్షులు హరిబాబు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధు నాయుడు,తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్,కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసుదేవ్, ప్రకాష్, తెలుగు యువత అధ్యక్షులు కృష్ణ యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు త్యాగరాజు, కొట్టే హేమంత్ రాయల్, శరత్,శ్రీధర్, బాబి, ధనంజయ నాయుడు, ఎల్లప్ప, శరవణ, మధుసుధన్ నాయుడు , యువగళం వాలంటీర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ ఇవ్వండి

**- ఏపీయూడబ్ల్యూజే డిమాండ్**

**అనంతపురం :** కరువుకు నిలయమైన జిల్లాలో చాలా మంది సీనియర్ జర్నలిస్టులు, ఔత్సాహిక జర్నలిస్టులు సొంత పత్రికలు ఏర్పాటు చేసుకుని వాటి నిర్వహణతో సామాజిక సేవ చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నారని, ఈ నేపథ్యంలో అక్రిడిటేషన్ జీవో నిబంధనలను సడలించి మీకున్న విశేష అధికారాలతో జిల్లా అక్రిడేషన్ కమిటీ ఆమోదంతో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ( ఏపీయూడబ్ల్యూజే) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ జిల్లా అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్ , కార్యదర్శి షేక్ మహమ్మద్ అయూఫ్ ల నేతృత్వంలో జర్నలిస్టులు మంగళవారం ఇంచార్జ్ కలెక్టర్ విష్ణు చరణ్ ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. జిల్లావ్యాప్తంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో పాటు అనేకమంది జర్నలిస్టులు చిన్న, మధ్యతరహా పత్రికలు అడుక్కుంటూ స్మాల్ అండ్ మీడియం విభాగంలో పనిచేస్తున్నారని ఇన్చార్జి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఇంచార్జ్ కలెక్టర్ఏపీయూడబ్ల్యూజే విన్నపం పట్ల ఇంచార్జ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీకి సంబంధించి సభ్యుల నియామక ప్రక్రియ ముగియడంతో త్వరలోనే కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. దీనిపై ఐఅండ్ పీఆర్ ఏడితో జర్నలిస్టుల అక్రిడిటేషన్ల మంజూరుకు సంబంధించిన వివరాలన్నీ చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సభ్యులు రామకృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేపీ కుమార్, పూలశెట్టి చలపతి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేంద్ర నాథ్ రెడ్డి, జిల్లా కమిటీ అధ్యక్షుడు రసూల్, చిన్న పత్రికల సంఘం ప్రతినిధులు చౌడప్ప, డేవిడ్, బాబ్జన్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యుడు బివి రెడ్డి, రాజా హ్సన్నూర్, జయరామిరెడ్డి, పలువురు ఇతర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో

# అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల** మున్సిపల్ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ఇంచార్జి కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి, మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల స్వీకరణకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణకు ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారని, వాటిలో ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, సహాయార్థం ప్రత్యేక హెల్ప్ డెస్క్ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే ఎన్ఓసీ కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. సందర్శనలో మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు ఉన్నారు.

# కందులకు ప్రభుత్వమే మద్దతు ధర అందిస్తుంది

**- ఏవో జి మల్లేష్ కుమార్**



**సి. బెళగల్** మండలంలోని సి బెలగల్ -2 రైతు సేవా కేంద్రం నందు మండల వ్యవసాయ అధికారి జి మల్లేష్ కుమార్ పొలం పిలుస్తుందనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం రబీ సీజన్లో సాగు చేస్తున్నటువంటి పంటలను ఈ పంట నమోదు చేసుకోవాలని రైతులకు తెలియజేశారు. అదేవిధంగా మండల పరిధిలోని క్షేత్రస్థాయిలో ఉన్నటువంటి కొర్ర పంటలను పరిశీలించడం జరిగినది. రైతు సోదరులు ఇప్పుడు సాగు చేస్తున్నటువంటి పంటలలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలియజేశారు. అదేవిధంగా (ఏపీఏఫ్ఆర్ )రైతు విశిష్ట నమోదు సంఖ్యను ఇంకా ఎవరైనా నమోదు చేసుకుని వారు ఉన్నట్లయితే వారు ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా ఖరీఫ్ సీజన్లో సాగు చేసినటువంటి కందులను ప్రభుత్వంకు మద్దతు ధర అమ్ముకోదలుచుకున్నవారు కచ్చితంగా రైతు సేవా కేంద్రంలోని ఇన్చార్జిలను సంప్రదించి కందుల కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా వ్యవసాయ అధికారి ఈ ప్రకటన ద్వారా తెలియజేశారుఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఏఈఓ హిమబిందు ఆర్బికే ఇన్చార్జి ఆసిఫ్ రైతులు పాల్గొనడం జరిగినది.

# ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



**నరసరావుపేట** నరసరావుపేటలో ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. కళాశాల వసతి గృహంలో కూరకుల బాలకోటి రెడ్డి(18) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కాలేజీలో ప్రస్తుతం ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. స్వగ్రామం సంతమాగులూరు మండలం ఎల్చూరు గ్రామం. నాలుగు నెలల క్రితం మృతి చెందిన బాలుడికి హెర్నియా ఆపరేషన్ జరిగింది అని తల్లి హైమావతి వెల్లడించింది. కాలేజీలో విద్యార్థుల వద్ద ఘర్షణ కారణంగానే మా కొడుకు చనిపోయాడని విద్యార్థి తల్లి హైమావతి ఆరోపించింది. పోస్టు మార్టం కోసం నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి మృతదేహం తరలించారు.

# ఏసీబీ వలలో సబ్ ట్రేజరీ అధికారులు

**శ్రీకాకుళం** ఉపఖజానా కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఖజానా అధికారులు ఏసీబీకి చిక్కారు. ఉపఖజానా అధికారి రవిప్రసాద్, అకౌంటెంట్ శ్రీనివాసరావు దొరికిపోయారు. కిల్లిపాలెంలోని డిజిటల్ అసిస్టెంట్ దగ్గర అధికారులు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణ. పోస్టు క్రమబద్ధీకరణ కోసం లంచం డిమాండ్ చేసారు.

## కృష్ణా నదిలో గుర్తు తెలియని

# యువకుడి మృతదేహం లభ్యం



**తాడేపల్లి** తాడేపల్లి పరిధిలోని కృష్ణా నది తీరంలో మంగళవారం ఒక గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. నదిలో మృతదేహం ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారం మేరకు తాడేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నది నుంచి వెలికి తీశారు. మృతుడి వయస్సు సుమారు 25 ఏళు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం నీటిలో ఉండటం వల్ల గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఉబ్బిపోయి ఉంది. మృతుడు ఎక్కడి వాడు? ప్రమాదవశాత్తు నీటిలో పడి మరణించాడా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా? అనే కోణంలో తాడేపల్లి పోలీసులు విచారణ చేపట్టారు.

## అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల

# సమ్మె విజయవంతం



**తిరుపతి, జనవరి 27** :యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ (యు.ఎఫ్.బి.యు) ఆధ్వర్యంలో దేశం లోని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్ ఉద్యోగుల సమ్మె మంగళవారం విజయవంతమైంది. యూనియన్ పిలుపుమేరకు, వారానికి 5 రోజుల పని అమలు చేయాలనే ముఖ్యమైన డిమాండ్ తో సమ్మె సాగింది. దశాబ్దకాలంగా 5 రోజుల పని విధానాన్ని అమలు చేయాలని బ్యాంకు యూనియన్స్ డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే 2వ, 4 వ శనివారాలు సెలవులుగా అమల్లో ఉంది. 2023 మార్చి 8 న ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) బ్యాంక్ యూనియన్లతో 5 రోజుల బ్యాంకింగ్ అమలుకు అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ ప్రధాన డిమాండ్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఫైనాన్సియల్ సర్వీస్ (డి.ఎఫ్.ఎస్) దగర దాదాపు 3 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఈ 5 రోజుల పని విధానం అమలు లో ఉంది, మనదేశంలో ఆర్.బి.ఐ, ఎల్.ఐ.సి, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు 5 రోజుల పని విధానం అమల్లో ఉంది. కానీ బ్యాంకు ఉద్యోగులపైన ఈ చిన్న చూపు ఎందుకని నేతలు ప్రశ్నిస్తున్నారు. గత దశాబ్ద కాలంగా బ్యాంకులు డిజిటల్ వైపు విజయవంతంగా బ్యాంకు ఖాతాదారులకు దగర అయింది. ప్రస్తుతం 2వ, 4వ శనివారాలు సెలవు అమల్లో ఉంది. బ్యాంక్ ఎంప్లాయీస్ ఈ టార్గెట్స్, పోటీ బిజినెస్ వల్ల తీవ్రమైన వత్తిడితో ఉన్నారని వారు చెబుతున్నారు. 5రోజుల పని విధానం వల్ల వర్క్ లైఫ్ బ్యాలెన్స్ అవుతుందంటున్నారు. వివిధ వర్గాల ప్రజలను ఈ సమ్మెకు మద్దతు కోరారు. మంగళవారం తిరుపతి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మున్సిపల్ రోడ్ బ్రాంచ్ నందు తిరుపతి బ్యాంక్ ఎంప్లాయీస్ అందరూ సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి యూ.ఎఫ్.బి.యూ కన్వీనర్, ఎస్బిఐ స్టాఫ్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వీవీ ప్రసాద్, ఎస్బిఐ స్టాఫ్ వైస్ ప్రెసిడెంట్ కె. గిరిధర్, ఎస్బిఐ ఆఫీసర్ సిఆర్ఎస్ గోపినాథ్, ధన్వంత కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్, పి.ఎన్.బి యూనియన్, పి. విజయ్ భాస్కర్ రెడ్డి, ఛైర్మెన్ యబిఐ యూనియన్, శేషసాయి, స్టేట్ ప్రెసిడెంట్, ఏఐబిఓసి, రిప్రెసెంటింగ్ యూనియన్ బ్యాంక్. తిరుపతి పట్టణం లోని బ్యాంక్ ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొన్నారు

# కంటోన్మెంట్ విలీనం కోసం దీక్ష

**- మద్దతు తెలిపిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్**



**హైదరాబాద్** కంటోన్మెంట్ నియోజకవర్గం వర్గంలో ఎమ్మెల్యే శ్రీ గణేష్ గారి ఆధ్వర్యంలో ఏడు రోజులనుంచి జరుగుతున్న కంటోన్మెంట్ బోర్డు విలీనం కోసం జరుగుతున్న రిలే నిరాహార దీక్షకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేయాలన్న ప్రజల న్యాయమైన డిమాండ్కు మేము పూర్తిగా మద్దతు ఇస్తున్నామని..ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా మౌలిక వసతుల లోపంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధిలైట్లు, శానిటేషన్ వంటి కనీస సౌకర్యాలు కూడా సక్రమంగా లభించక నిత్యం వీళ్ళు పడుతున్న బాధ చాలా బాధాకరం అని కంటోన్మెంట్ను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే ప్రజలకు సమగ్ర అభివృద్ధి జరుగుతుంది కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అగారు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ప్రజల గొంతుకగా మారిందని అన్నారు. ఈ ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి సంఘీభావం తెలుపుతున్నామని ప్రభుత్వ స్థాయిలో ఈ అంశాన్ని గట్టిగా ప్రస్తావించి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఢిల్లీ వరకైనా వెళ్తామని అన్నారు.

# కొండపల్లిలో ఎంపి చిన్ని పర్యటన


**విజయవాడ** కొండపల్లి కోట, సీతాకోక చిలుకల పార్క్, పవిత్ర సంగమం ప్రాంతాల్లో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్,కూటమి నాయకులు మంగళవారం పర్యటించారు. ఎంపి చిన్ని మాట్లాడుతూ టూరిజం పరంగా కొండపల్లి ని అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ప్రతిపాదనలను సీఎం, డిప్యూటీ సీఎం ముందు ఉంచి కొండపల్లి అభివృద్ధి ని కోరతామని వెల్లడించారు. కూటమి శ్రేణులంతా బృందం గా ఏర్పడి కొండపల్లి కోట అభివృద్ధి కి ముందుకెళతామన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు

# అందరు సిద్ధంగా ఉండాలి

**- రాష్టం లో 116 మున్సిపాలిటీలకు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు**

**- జిల్లాలో 5 మున్సిపాలిటీలకు ఎన్నికలు**



**జగిత్యాల** మున్సిపల్ ఎన్నికలకు అందరు సిద్ధంగా ఉండాలనిరాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ రెండవ



సాధారణ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి 116 మున్సిపాలిటీలకు 07 కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్లు అన్ని రకాలుగా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ లు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో జరిగే ఎన్నికలు అధికారులు మరియు పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంది ఎన్నికలు స్వేచ్ఛా, పారదర్శకంగా జరిగేలా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు మాట్లాడుతూ రెండవ సాధారణ గ్రామ పంచాయితీ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించారని కలెక్టర్లు, ఎస్పీలు మరియు అధికార యంత్రాంగానికి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పంచాయితీ ఎన్నికల లాగే రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛా మరియు పారదర్శకంగా నిర్వహించే విధంగా అన్నిరకాల చర్యలు తీసుకొని అన్ని రకాల ఏర్పాట్లు చేసుకొని మొత్తం అధికార యంత్రాంగం సర్వం సిద్ధంగా ఉంచాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలకు పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని తెలిపారు. అలాగే పట్టణ కేంద్రాల్లో జరిగే ఎన్నికలు కావున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని రకాల బందోబస్తు చర్యలు తీసుకోవాలని 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అవసరమైతే అటవీ, ఎక్సైజ్ శాఖల సిబ్బందిని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీలకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 5 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగనున్నట్లు వీటికి మున్సిపల్ కమిషనర్లు, స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లు సిద్ధంగా ఉండాలని తెలిపారు. అలాగే సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను మరొకసారి వెరిఫై చేయాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే అధికార యంత్రాంగం మొత్తం ఎన్నికల కమిషన్ పరిధిలోకి వస్తుందని అధికారులందరు ఎన్నికల నియమావళి సక్రమంగా పాటించాలని తెలిపారు. మొదట 24,48 మరియు 72 గంటల రిపోర్టులు వెనువెంటనే పంపాలని తెలిపారు. జగిత్యాల జిల్లాలో రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులందరు సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో మాన్‌పవర్ మేనేజ్‌మెంట్, శిక్షణ, బ్యాలట్ బాక్సులు, రవాణా, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఖర్చుల పర్యవేక్షణ, మీడియా, హెల్ప్‌లైన్, ఫిర్యాదుల పరిష్కారం, నివేదికలు, మైక్రో ఆబ్జర్వర్లు తదితర కీలక అంశాలకు జిల్లా స్థాయిలో బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. నియమితులైన నోడల్ అధికారులు జిల్లా ఎన్నికల యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, ఆదేశాల ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి , ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు

# దళిత సాహిత్యోద్యమ రథసారథి

పత్రికా పాఠకులకు సుపరిచితులు డాక్టర్ ఎండ్లూరి సుధాకర్. జీవితాంతం నిజాయితీ బాట లోనే నడిచారు. నిబద్ధతకు మారుపేరు గా నిలిచారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం మూర్తీభవించిన వ్యక్తిత్వం సుధాకర్ కే సొంతం. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ జనవరి 21, 1959 న నిజామాబాద్ లోని పాముల బస్తీలో తన అమ్మమ్మ గారి ఇంట్లో జన్మించారు. కేంద్ర సాహిత్య అకాడమీ జ్యూరీ సభ్యులు, తెలుగు సలహా మండలి సభ్యు లు, తెలుగు అకాడమీ సభ్యు లు, ప్రసిద్ధ హిందీ, ఉర్దూ పద్యాల, లఘు చిత్రాల అనువాదకులు. హైదరాబాద్ విశ్వ విద్యా లయం తెలుగు విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ గా పని చేశారు. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ జనవరి 21, 1959 లో నిజామాబాద్ లోని పాముల బస్తీలో దేవయ్య, శాంతా బాయిలకు ప్రథమ సంతానంగా జన్మించారు. హైదరాబాద్ వీధి బడిలో ప్రారంభమైన చదువు విశ్వవిద్యాలయం వరకు హైదరా బాద్ లోనే సాగింది. నల్లకుంట ప్రాచ్య కళాశాలలో ఓరియంటల్ విద్య, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎం .ఏ . ఎం.ఫిల్, పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వ విద్యాలయం లో పిహెచ్ .డి చేసారు. ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించి విశ్వవిద్యా లయ ఆచార్య స్థాయికి చేరు కున్నారు. 1985 నుంచి 1990 వరకు సికింద్రాబాద్ లోని వెస్లీ బాయ్స్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్ గా ఉద్యోగం చేసారు. 1990 అక్టోబరు 6 వ తేది నుంచి వివిధ పదవుల్ని నిర్వ హించారు. 2004 సం.నుంచి 2011 సం.వరకు తెలుగు విశ్వ విద్యాలయం ప్రచు రించే 'వాఙ్మయి' సాహిత్య పత్రికకి సహాయ సంపాదకుడిగా, సంపాదకుడిగా వ్యవహరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, అసోసి యేట్ ప్రొఫెసర్ గా, ప్రొఫెసర్ గా ఆధునిక శాఖాధిపతిగా, (1994 నుంచి 2012 వరకు) పదవుల్ని నిర్వహించారు. 2009, సెప్టెంబరు 5వ తేదీ నుంచి రాజమండ్రి సాహి త్య పీఠానికి ఆచార్యులుగా, డీన్ గా బాధ్యతలు నిర్వహించారు. జూలై 2002లో అమెరికా తెలుగు అసోసియేషన్‌లో జరిగిన పలు సాహిత్య సభల్లో ప్రసంగించారు. 2011, డిసెంబర్ 8,9,10 తేదీలలో మారిషస్ లో ప్రపంచ తెలుగు సదస్సులో పాల్గొన్నారు. మే 2017లో అమెరికాలోని న్యూజెర్సీ సిటీలో సిలికాన్ ఆంధ్రా ద్వారా మనబడి కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు. తెలుగు దళిత కవిత్వంలో తనదైన ముద్ర వేసుకున్న ఎండ్లూరి...వర్తమానం, కొత్త గబ్బిలం, నా అక్షరమే నా ఆయుధం, మల్లెమొగ్గల గొడుగు, నల్లద్రాక్ష పందిరి, వర్గీకరణీయం, గోసంగి, కథానాయకుడు జాషువా, తెలి వెన్నెల, తదితర రచనలు గావించి, తెలుగు సాహితీ క్షేత్రంలో తమదైన స్థానాన్ని పదిల పరచు కొన్నారు. నేటికి ఆయనను అనుకరిస్తూ, అనుసరిస్తూ ఆయన బాటలో పయనిస్తున్న వారు ఎందరో కవులు ఉన్నారంటే ఆయన ప్రభావం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాటి కవుల పట్ల సహృదయతే తప్ప అసూయ ఎరగని వ్యక్తిత్వం, ఎంత ఎత్తు ఎదిగినా అతి సామాన్య జీవితం గడపడం లాంటి ప్రత్యేకతలు ఆయనకే చెందుతాయని ఆయన తో పరిచయమున్న వారు చెపుతా రు. గుర్రం జాషువా అనంతరం అంతటి విశాల హృదయం, భావుకత లాంటి బహుముఖీన ప్రజ్ఞ సుధాకర్ లోనే కనబడుతుంది అంటే అతిశయోక్తి కాదు. దళిత సాహితీ రథసారథి ఎండ్లూరి సహ ధర్మచారిణి దివంగత హేమలత, రచయిత్రి సామాజిక సేవకురాలు కాగా, వారి కూతురు ఎండ్లూరి మానస కథా రచయిత్రి, ఆమె రాసిన కథా సంపుటి "మిళినీద" కు 2020 సం.పు కేంద్ర సాహిత్య యువ పురస్కారం లభించడం విశేషం. లలిత కళా పరిషత్ పురస్కారం, నల్గొండ, స్లిష్టల వెంకటల్లు దీక్షితులు స్మారక సాంస్కృతిక సాహితీ కళా సమితి , యల మంచిలి, ఫ్రీవర్స్ ఫ్రంట్, ఉదయ భారతి జాతీయ అవార్డు, భువనే శ్వర్, కవికోకిల జాషువా, తిలక్ అవార్డు, బెంగళూరు, గరిక పాటి సాహిత్య పురస్కారం కాకినాడ, సమతా రచయితల పురస్కారం అమలాపురం, రాజ మండ్రి ప్రతిభాపురస్కార్, రాజ మండ్రి, జాసిస్ అవార్డు, రాజ మండ్రి, మ్యాన్ ఆఫ్ ది ఇయర్, రాజమండ్రి, తెలుగు విశ్వ విద్యాలయం ధర్మనిధి పురస్కారం, బి.ఎస్. రాములు కథా పురస్కారం, ఎన్.జి. రంగాసెంటరీ అవార్డు, డెట్రాయిట్ తెలుగు అసో సియేషన్ సిల్వర్ జూబ్లీ అవార్డు, అమెరికా తెలుగు అసోసియేషన్ ఆటా, డల్లాస్ , సినారె పురస్కారం - కరీంనగర్ , నేదురుమల్లి జనార్ధన రెడ్డి ట్రస్ట్ ప్రకాశం, నెల్లూరు, సహృ దయ సాహితీ పురస్కారం, వరంగ ల్, కొండెపూడి శ్రీనివాసరావు కవితా పురస్కారం, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్ అధికారభాషా సంఘ పుర స్కారం, ఆంధ్రప్రదేశ్ ఉగాది విశిష్ట సాహిత్య పురస్కారం, గాడే పల్లి కుక్కుటేశ్వరరావు స్మారక పురస్కా రం, అద్దంకి, తపన ఫౌండేషన్ అవార్డు రాజమండ్రి, ప్రతిభా వంతులైన విశ్వవిద్యాలయ ఉపా ధ్యాయులకు రాష్ట్ర అవార్డు, కవి జాషువా సాహిత్య ఆం.ప్ర. ప్రభుత్వ అవార్డు, రాజహంస కృష్ణ శాస్త్రి కవితా పురస్కారం, పిఠా పురం, ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ ద్వారా ఎన్టీఆర్ ప్రతిభా పుర స్కారం, యువకళా వాహిని ద్వారా డాక్టర్ జి ఎన్ రెడ్డి మెమోరియల్ అవార్డు, అరుణ్ సాగర్ ట్రస్ట్ ద్వారా కవి అరుణ్ సాగర్ మెమోరియల్ అవార్డు, లెక్క లేనన్ని అందు కున్నారు.

28 జనవరి 2022 (శుక్రవారం) తెల్లవారు జామున హైదరాబాద్ లో తుది శ్వాస విడిచారు. 63వ పుట్టిన రోజు

# వెనిజులాపై అమెరికా పెత్తనం సాగేనా!

ఒక సర్వసత్తాక దేశం మీద దాడి చేసి ఆ దేశపు అధ్యక్షుడిని కిడ్నాప్ చేసి అన్ని అంతర్జాతీయ న్యాయ సూత్రాలనూ కాలరాసిన ట్రంప్ తాను వెనిజులాలో ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను కాపాడానని చెప్పుకుంటున్నాడు ! మదురో ఒక మాదకద్రవ్య ముఠాకు నాయకుడిగా ఉన్నట్టు, ఆ ముఠాను అరికట్టకపోతే అమెరికా భద్రతకే ముప్పు వాటిల్లనున్నట్టు ప్రచారం చేస్తున్నాడు. కానీ వాస్తవానికి ప్రపంచంలో జరుగుతున్న కొకైన్ వ్యాపారంలో ఉన్న అంతర్జాతీయ ముఠా నెట్‌వర్క్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్నది మెక్సికో, కొలంబియా, హొండురాస్, అర్జెంటినా, ఈక్వెడార్ వంటి దేశాల్లోనుండి పని చేస్తున్న మితవాద శక్తులు. ఈ శక్తులకు అమెరికా అండదండలు పుష్కలంగా లభిస్తున్నాయి. అందులో వెనిజులా దేశంలోని డ్రగ్ మాఫియా వాటా నామమాత్రమే. ఐనా, తక్కిన దేశాలను వదిలిపెట్టి వెనిజులా మీదనే పడ్డాడు ట్రంప్. ఈ దాడికి ప్రధాన కారణం వెనిజులాలో ఉన్న చమురు నిల్వల మీద పెత్తనాన్ని పొందాలని అమెరికా భావించడమే. వెనిజులాతో ప్రారంభించి మొత్తం లాటిన్ అమెరికా దేశాలన్నింటిపైనా తన పెత్తనాన్ని చెలాయించాలని అమెరికా భావిస్తోంది. 1817-1825 మధ్య అమెరికా అధ్యక్షుడిగా వ్యవహరించిన జేమ్స్ మన్రో ఆ కాలంలో ఒక సిద్ధాంతాన్ని ప్రకటించాడు. దానినే మన్రో సిద్ధాంతం అని పిలుస్తారు. దాని ప్రకారం తన దేశ భద్రత, రక్షణ అవసరాల కోసం ఎప్పుడైనా, ఏ దేశం మీదనైనా సైనిక చర్యలతో సహా ఎటువంటి చర్యలకైనా పూనుకునే హక్కు అమెరికాకు ఉంది. చాలా దుర్మార్గమైన ఈ సిద్ధాంతానికి తర్వాత కాలం చెల్లింది. కాని ట్రంప్ శతాబ్దాలక్రితమే తిరస్కరించబడిన ఆ సిద్ధాంతాన్ని మళ్లీ ముందుకు తెచ్చాడు. ఇప్పుడు మన్రో సిద్ధాంతం కాస్తా 'డాన్రో' సిద్ధాంతంగా పేరు మార్చుకుంది. (ట్రంప్ పేరులోని మొదటి భాగం డొనాల్డ్‌లోని డాన్ ను, మన్రో పేరులోని ఒక భాగాన్ని కలిపి డాన్రో చేశారు) అమెరికాకనుకూలంగా తొత్తు మాదిరిగా వ్యవహరించే ప్రభుత్వాన్ని తొలగించి ఆ స్థానంలో చావెజ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక వెనిజులాలోని చమురు కంపెనీలను జాతీయం చేశాడు. వాటి ద్వారా లభించే ఆదాయాన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాల కోసం ఖర్చు చేయసాగాడు. దానికి ప్రతీకారంగా అమెరికా వెనిజులా మీద ఆంక్షలు ప్రకటించింది. విదేశాల్లో ఉన్న వెనిజులా పెట్టుబడులను స్తంభింపజేసింది. దాంతో వెనిజులా తీవ్ర ఆర్థిక వత్తిడికి లోనైంది. ఆ పరిస్థితుల్లో వెనిజులా చైనా, రష్యా, ఇరాన్ దేశాలతో ఆర్థిక, సైనిక సంబంధాలను బలపరుచుకుంది. తక్కిన లాటిన్ అమెరికా దేశాలకు దగ్గరైంది. ఐనప్పటికీ అమెరికా ఆంక్షలు వెనిజులాను కుంగదీశాయి. గతంలో రోజుకు 3.5 లక్షల బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేసిన పరిస్థితి నుండి ఆంక్షల తర్వాత అందులో మూడో వంతు కూడా ఉత్పత్తి చేయలేని స్థితి వచ్చింది. ఇదే అదనుగా భావించిన ట్రంప్ మదురో దంపతుల కిడ్నాప్‌కూ పూనుకున్నాడు. వారిని అడ్డం పెట్టుకుని వెనిజులాలోని చమురు కంపెనీల మీద మళ్లీ పెత్తనాన్ని పొందాలని భావిస్తున్నాడు. అందుకు వీలుగా వెనిజులాలో తన తొత్తుగా వ్యవహరించే మారియా కొరినా మచాడోను గద్దె మీద కూర్చోబెట్టదలిచాడు. కానీ వెనిజులాలోని ప్రజాభిప్రాయం అందుకు బాగా వ్యతిరేకంగా ఉంది. మదురోతోబాటు ఉపాధ్యక్షురాలిగా పని చేసిన డెల్సీ రోడ్రిగజ్ తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలు ఇప్పుడు నిర్వహిస్తున్నారు, తామంతా మదురోతోనే ఉన్నామని స్పష్టం చేశారు. ఇప్పుడు అమెరికా ఎలా వ్యవహరించబోతోంది అన్నది చూడాలి. వెనిజులాలో చమురు నిల్వల మీద పట్టు ఒకవేళ అమెరికా సంపాదించినా, మళ్లీ అక్కడ చమురు ఉత్పత్తిని పాత స్థాయికి తీసుకురావాలంటే 18000 నుండి 20000 కోట్ల అమెరికన్ డాలర్ల పెట్టుబడులు వెంటనే అవసరం. కాని అమెరికన్ చమురు కంపెనీల మొత్తం పెట్టుబడులే 41,300 కోట్ల డాలర్లు. అదీ గాక, ఒకసారి జాతీయం అయిన చమురు కంపెనీల నుండి తాము పొందుతున్న ప్రయోజనాలను చవిచూసిన వెనిజులా ప్రజలు తమ చమురు కంపెనీలను అమెరికాకు కట్టబెట్టడానికి అంగీకరించే పరిస్థితిలో లేరు. ఇంకో పక్క చైనా కూడా వెనిజులాలో భారీగానే పెట్టుబడులు పెట్టింది. మదురోను కిడ్నాప్ చేసిన వెంటనే చైనా, రష్యా వెనిజులాకు, మదురోకు తమ మద్దతు ప్రకటించాయి. అందుచేత వెనిజులా విషయంలో అమెరికాదే ఇష్టారాజ్యంగా చెలామణీ అవుతుందని భావించలేం. కేవలం చమురు నిల్వల మీద పట్టు కోసమే అమెరికా ఇదంతా చేస్తోందని అనుకోలేం. దాని ప్రధాన లక్ష్యం తన ప్రపంచాధిపత్యాన్ని సవాలు చేస్తున్న చైనాను నిలువరించడం. చాలా లాటిన్ అమెరికా దేశాలకు చైనా ఇప్పుడు ప్రధాన వాణిజ్య భాగస్వామిగా ఉంది. లాటిన్ అమెరికాలోని 22 దేశాలు చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌లో చేరాయి. చైనా వెనిజులా నుంచి చమురు దిగుమతులను డాలర్లలో కాకుండా యువాన్లలో చేసుకుంటోంది. చాలా లాటిన్ అమెరికా దేశాల్లో మౌలిక వసతుల రంగంలో పెట్టుబడులు పెట్టింది. అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్‌తో పని లేకుండా వుండే విధంగా క్రాస్ బోర్డర్ ఇంటర్ బ్యాంక్ పేమెంట్ సిస్టం పేరుతో ఆర్థిక లావాదేవీల వ్యవస్థను చైనా ప్రవేశపెట్టింది. ఈ ప్రయత్నాలన్నీ అంతిమంగా తన డాలర్ ఆధిపత్యానికి సవాలుగా మారుతాయని అమెరికా ఆందోళన చెందుతోంది. తన మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ నినాదం ఆచరణలో ముందుకు అడుగు వేయలేకపోతోందని ట్రంప్ గ్రహిస్తున్నాడు. మూడవ ప్రపంచ దేశాలనుండి సరుకుల ఉత్పత్తి రంగాలు అమెరికాకు తరలిరావడానికి సిద్ధంగా లేవు. అమెరికాలో ఉత్పత్తి ఖర్చులు చాలా ఎక్కువగా ఉండడమే ఇందుకు కారణం. ఏకధృవ ప్రపంచం అనే వాతావరణం ఇప్పుడు లేదు. డాలర్ ఆధిపత్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రపంచీకరణ క్రమం పెట్టుబడిదారీ వ్యవస్థను మొత్తంగానే తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. సామ్రాజ్యవాద ఆధిపత్యం, దానికి మొనగాడి స్థానంలో ఉన్న అమెరికా పరిస్థితి పెను సవాళ్లనెదుర్కొంటున్నాయి. చేజారిపోతున్న తన ఆధిపత్యాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలని అమెరికా ప్రయత్నిస్తున్నప్పటికీ, అందుకు ప్రతికూల దిశలో పనిచేస్తున్న శక్తులూ బలంగానే ఉన్నాయి. అమెరికా, సామ్రాజ్యవాద శక్తుల ఆధిపత్యంతో గత 35 సంవత్సరాలుగా కొనసాగుతున్న ప్రపంచీకరణ క్రమం మూడవ ప్రపంచ దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బ తీసింది. సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని బలంగా సవాలు చేస్తున్న శక్తులున్న ఈ తరుణంలో మూడవ ప్రపంచ దేశాలు, ముఖ్యంగా భారతదేశం తమ సార్వభౌమాధికారాన్ని తిరిగి బలంగా నిలబెట్టడానికి ఇదే మంచి తరుణం. కాని, మోడీ ప్రభుత్వం దురహంకారపూరిత సంకుచిత జాతీయవాదంతో వ్యవహరిస్తూ మరోపక్క అమెరికా అడుగులకు మడుగులొత్తుతోంది. దేశ విశాల ప్రయోజనాలు దీనివలన దెబ్బ తిన్నా తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోంది. అందుచేత ప్రగతిశీల శక్తులమీద బాధ్యత ఎక్కువగా ఉంది. సామ్రాజ్యవాద వ్యతిరేకత బలంగా ప్రజానీకంలో నెలకొల్పడానికి దేశక్తియుత శక్తులన్నీ ఐక్యంగా పాటుపడాల్సిన సమయం ఇది.

# బ్రిటిష్ పాలకుల సింహస్వప్నం

లాలా లజపతిరాయ్ జీవితం భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఒక మైలు రాయి. ఆనాటి భారతీయులను ఎందరినో ఆయన భావాలు, త్యాగాలు ప్రభావితం చేశాయి. ఆయన పిలుపు దేశ ప్రజల గుండెలలో మారుమోగి, లక్షలాది మంది భారతీయులు స్వాతంత్ర్య ఉద్యమంలోకి దిగి, ఆ మహా యజ్ఞంలో సమిధలు కావడానికి ప్రేరణ కలిగించింది. కోట్లాది ప్రజలకు ఆరాధ్య దేవునిగా లాలాజీ పూజలు అందుకున్నారనడంలో అతిశయోక్తి లేదు. 'నేను మరణించవచ్చు, కాని నానుండి వెలువడే ప్రతి నెత్తురు చుక్క నుండి లక్షలాది స్వాతంత్ర్య సమరయోధులు ఉద్భవిస్తారు' అని ప్రకటించారు. లాలా మాట నిజం అయింది. అయన మరణానంతరం స్వాతంత్ర్యోద్యమం మరింతగా విస్తృతం అవుతుందని తెలిసిన భవిష్యత్ దర్శకుని జీవితం భారతీయులకు స్ఫూర్తిదాయకం. స్వదేశీ ఉద్యమం, ఆర్య సమాజాన్ని, అతివాద రాజకీయాలను సమన్వయ పరచిన భారత జాతీయ అగ్ర నాయకులలో లాలా లజపతిరాయ్ ఒకరు. ఒకే భావాలు కలిగిన స్వాతంత్ర్య సమర యోధులైన లాలా లజపత్ రాయ్, బాలగంగాధర తిలక్, బిపిన్ చంద్రపాల్ లను "లాల్ బాల్ పాల్" అని పిలిచేవారు. లాలా లజపత్ రాయ్ (జనవరి 28, 1865 - నవంబరు17, 1928) పంజాబ్ రాష్ట్రం మోఘా జిల్లా ధుడీకె గ్రామంలో జన్మించారు. భారత స్వతంత్ర సంగ్రామంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ధీరులలో ఒకరిగా చిరస్థాయిగా నిలిచి పోయారు. ఆయన "పంజాబ్ కేసరి" బిరుదాంచితులు అయినారు. అయన పంజాబ్ నేషనల్ బ్యాంకు, లక్ష్మి ఇన్సూరెన్స్ కంపెనీల స్థాపకుడు. లాహోర్‌లో న్యాయవిద్య అభ్యసిస్తున్నప్పుడు స్వాతంత్ర్యోద్యమం వైపు దృష్టి సారించారు. అదే సమయంలో స్వామి దయానంద సరస్వతి భావాలవైపు మొగ్గు చూపారు. 1877లో లాగోర్ ఆర్యసమాజ్ సభ్యుడిగా ఉంటూనే ఆర్య గెజిట్‌కు సంపాదకత్వం వహించారు. 1888, 1889 లలో జరిగిన జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశాలలో ఆయన ప్రతినిధిగా పాల్గొన్నారు. ఆ తర్వాత 1892లో హైకోర్టులో న్యాయవాదిగా లాహోర్ కు వెళ్లారు. 1885వ సంవత్సరంలో ఒక ప్రభుత్వ కళాశాల నుండి రెండవ తరగతి న్యాయవాద పరీక్షలో ఉత్తీర్ణులై హిస్సార్ లో న్యాయవాద వృత్తి ప్రారంభించారు. ఆ తర్వాత 1892లో లాహోర్ కు మకాం మార్చారు. భారత జాతీయ కాంగ్రెస్ లోని ప్రముఖ నాయకులలో లాలా లజపతిరాయ్ ఒకరిగా గుర్తింపు పొందారు. 'స్వేచ్ఛ అనేది అభ్యర్థించడం నుంచి రాదు, కానీ అది పోరాడాలి' అనే బాల గంగాధర్ తిలక్, బిపిన్ చంద్ర పాల్ ల అభిప్రాయాలతో ఆయన ఏకీభవించారు. అలా భారత జాతీయ కాంగ్రెస్‌లో ప్రవేశించి 1920లో కలకత్తాలో జరిగిన ప్రత్యేక సమావేశానికి అధ్యక్షులుగా ఎన్నికైనారు. 1921లో "సర్వెంట్స్ ఆఫ్ పీపుల్స్ సొసైటి" పేరుతో స్వచ్ఛంద సంస్థను నెలకొల్పారు. జాతీయోద్యమంలో "పంజాబ్ కేసరి"గా పేరు పొందారు. "ఆర్య సమాజం నా తల్లి, వైదిక ధర్మం నా తండ్రి" అంటుండే వారు ఆయన. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో లాలా కూడా పాల్గొన్నారని, ఆయనతో పాటు సురేంద్ర నాథ్ బెనర్జీ, బిపిన్ చంద్ర పాల్, అరవింద్ ఘోష్ లతో కలిసి బెంగాల్ తదితర ప్రాంతాల్లో ప్రజలను ఏకం చేసి స్వదేశీ ఉద్యమాన్ని ఉధృతం చేశారని చరిత్ర చేపుతున్నది. భారత దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఆయన తన పూర్తి శక్తిని వినియోగించారు. చివరికి న్యాయవాద వృత్తిని కూడా వదులు కున్నారు. సైమన్ కమిషన్ లో భారతీయ ప్రతినిధి ఎవరూ లేని అంశం భారతీయుల ఆగ్రహానికి ఆజ్యం పోయగా, ఆ తర్వాత దేశ వ్యాప్తంగా నిరసనలు మొదలైన నేపథ్యంలో లాలా లజపతిరాయ్ నిరసనలో ముందున్నారు. పోలీసు సూపరింటిండెంట్ జేమ్స్ ఎ. స్కాట్ కవాతును ఆపడానికి లాఠీచార్జి చేయాలని ఆదేశించారు. జేమ్స్ స్కాట్ బ్రిటిష్ పోలీసు ఉన్నతాధికారి విచక్షణ రహితంగా కసిగా, ఆవేశంగా లాఠీ దెబ్బలతో ఛాతీపై కొట్టాడు. 'ఇవాళ నా గుండెల మీద పడిన లాఠీ దెబ్బలు బ్రిటిష్ సామ్రాజ్య శవపేటికకి చివరిగా కొట్టిన మేకులవుతాయి.' అని ఆ సందర్భంగా లజపతి రాయ్ అన్న మాటలు. "అమాయక పౌరుల మీద దాడులకు దిగే ప్రభుత్వానికి నాగరిక ప్రభుత్వమని చెప్పుకునే హక్కు లేదు. అలాంటి ప్రభుత్వాలు ఎక్కువ కాలం కొనసాగలేవు!' అంటూ గర్జింపుతో స్వాతంత్ర్య పోరాట చరిత్రలో పంజాబ్ సింహమంటూ కీర్తి పొందిన లాలా లజపతిరాయ్ ఒక సందర్భంలో అన్నమాటలివి. ఆ మాటలు ఆయన కన్నుమూసిన రెండు దశాబ్దాలకు నిజమైనాయి. ఈ సంఘటనలో లజపతి రాయ్ తీవ్రంగా గాయపడి 1928 నవంబర్ 17న గుండె పోటుతో మరణించారు.

# నిశ్శబ్ద ఆరోగ్య సంక్షోభంలో భారతం

భారత దేశం నిశ్శబ్ద ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. నిశ్చల జీవనశైలి, జన్యుశాస్త్ర కారణాలతో పాటు మనం తీసుకునే ఆహార పదార్థాల వల్ల 'ఇన్సులిన్ నిరోధకత(ఇన్సులిన్ రెసిస్టెన్స్), జీవక్రియ సింద్రోమ్ (మెటబాలిక్ సింద్రోమ్) లక్షణాలు కనిపిస్తాయి. మన సాధారణ ఆహారంలో అధికంగా రొట్టెలు, బియ్యపు అన్నం తినడం, బంగాళాదుంపలు తీసుకోవడం, సమోసాలు/బజ్జీలు/బిస్కెట్లు నమలడం, చక్కెరలతో కూడిన శీతల పానీయాలు తాగడం, మైదా పదార్థాలు తీసుకోవడం, బర్గర్ ఫిజ్జాలు ఇష్టపడడం, స్నాక్స్ నమలడం, స్వీట్లు తినడం లాంటివి తీసుకోవడంతో భారతీయులకు జీవక్రియ సంబంధ అనారోగ్యాలు అధికంగా బయట పడుతున్నాయి. దీని ఫలితంగా భారతదేశం "మధుమేహ కేంద్రంగా భారత్" లేదా "డయాబెటిస్ క్యాపిటల్ ఆఫ్ వరల్డ్"గా కీర్తించబడుతున్నది. శరీర కణాలు క్లోమం ఉత్పత్తి చేసే ఇన్సులిన్ హార్మోన్‌కు తక్కువ స్పందన చూపినపుడు ఇన్సులిన్ నిరోధకత ఏర్పడుతుంది. కండరాలు, కాలేయం, కొవ్వు లాంటి శరీర కణజాలాలు ఇన్సులిన్‌కు స్పందించనపుడు, రక్తంలో కణాల్లోకి సులభంగా గ్లూకోజ్ చేరడం జరుగదు. దీని వల్ల క్లోమ గ్రంథి (ప్యాంక్రియాస్) అదనంగా ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తూ చివరకు ఆ హార్మోన్ సరిపోక రక్తంలో షుగర్ లెవల్స్ పెరిగి టైప్ - 2 మధుమేహం బయట పడుతుంది. ఇలాంటి అవాంఛనీయ పరిస్థితిని "ఇన్సులిన్ నిరోధకత (ఇన్సులిన్ రెసిస్టెన్స్)" అని, ఇది ఒక ప్రమాదకర జీవక్రియ రుగ్మతగా మారుతుంది. దీనినే "జీవక్రియ ఆరోగ్య సంక్షోభం (మెటబోలిక్ హెల్త్ క్రయసిస్)" అని పిలుస్తున్నాం. ఈ రుగ్మత వల్ల నిద్రలేమి, అలసట, బలహీనత, అధిక దాహం, , ఏకాగ్రత లోపం, దృష్టి కేంద్రీకరించడంలో ఇబ్బందులు, ఆకలి పెరగడం లాంటి లక్షణాలు అధికంగా కనిపిస్తాయి. ఈ విధమైన జీవక్రియ సంక్షోభం ఫలితంగా డయాబెటిస్‌తో పాటు ఊబకాయం (ఒబేసిటీ), గుండె జబ్బులు, స్త్రీలో హార్మోన్ల అసమతుల్యత, కాలేయ వ్యాధి (నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్ డిసీజ్) లాంటి ప్రాణాంతక అనారోగ్యాలు కలుగుతాయి.

అధిక బరువు ఉండడం, కాలేయం/బొడ్డు కొవ్వు పెరగడం, శారీరక శ్రమ లేకపోవడం, నిష్క్రియాత్మక జీవన శైలి అలవడడం, అధిక మానసిక ఒత్తిడి గుప్పిట్లో చిక్కడం లాంటి కారణాల వల్ల జీవక్రియ ఆరోగ్య సంక్షోభానికి లేదా ఇన్సులిన్ నిరోధకతకు దారి తీస్తుంది. ఇన్సులిన్ నిరోధకత నివారణకు ప్యాకెట్ ప్రాసెస్డ్ ఫుడ్స్, నిలువ ఉంచిన ఆహారం, జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్, కృత్రిమ చక్కెరలు, తీపి పాల ఉత్పత్తులు, రుచి కలిగిన పెరుగు, వేపుడు ఆహారం, చక్కెర పానీయాలకు దూరంగా చక్కటి ఆరోగ్యకర ఆహార అలవాట్లను పాటించాలి. ప్రతి రోజు క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయాలి. శరీర బరువును తగ్గించుకోవడం, మానసిక ఒత్తిడికి ఆస్కారం ఇవ్వకపోవడం, నిద్రకు తగిన సమయం కేటాయించడం లాంటి జీవనశైలి మార్పులను పాటించాలి. ఆకు కూరలు, తృణధాన్యాలు, చిక్కుళ్ళు, కొవ్వు చేపలు, తగినంత ప్రోటీన్ ఆహారం, దాల్చిన చెక్క, సుగంధ ద్రవ్యాలు తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. డిజిటల్ యుగపు యువత అసాధారణ జీవనశైలి, అవాంఛనీయ ఆహారపు అలవాట్లతో క్రమంగా జీవక్రియ ఆహార సంక్షోభం వైపు పయనిస్తున్నారు. దీని వల్ల తిరిగి కోలుకోలేని టైప్-2 మధుమేహం బారిన పడడం జరుగుతున్నది. ఈ విషయాల గంభీరతను దృష్టిలో పెట్టుకొని తమ తమ జీవనశైలిల్లో సకారాత్మక మార్పులు చేసుకుంటూ డయాబెటెస్‌కు దూరంగా ఆరోగ్యకర జీవితాలను అనుభవిద్దాం. జీవక్రియ సింద్రోమ్ లేదా సంక్షోభానికి చరమ గీతం పాడుదాం.

# సమ్మక్క సారలమ్మలకు సబ్బినాటితో అనుబంధం

దేశ మాతృ గౌరవాన్ని కాపాడేందుకు ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా విడిచి పెట్టిన అమర వీరులను ఆరాధించే సత్సంప్రదాయం హైందవ సంస్కృతిలో ఉంది. సమున్నత ఆశయ సాధనకోసం జీవితాలను త్యాగం చేసిన సమ్మక్క, సారలమ్మలను దైవాంశ సంభూతులుగా ఉత్తర తెలంగాణ జాన పదులు ఆరాధ్య దైవాలుగా కొలవడం సదాచారంగా మారింది. దాదాపు 900 సంవత్సరాల చారిత్రక నేపథ్యం కలిగిన వన దేవతల జాతర పూర్తిగా గిరిజన సాంప్రదాయంలోనే సాగుతుంది. అయితే గిరిజనులే కాక, గిరిజనే తరులు సైతం గద్దెలెక్కిన దేవతల ను కొలవడం వంశపారం పర్య ఆచరణగా కొనసాగుతున్నది. కాకతీయులు మొదట సబ్బినాడు (కరీంనగర్) లోనే రాజ్యము చేసి, చాళుక్యుల దయచే అనుమ కొండను సంపాదించారనే భావనకు, ప్రస్తుత జగిత్యాల జిల్లాలోని పొలవాసలో ఏకశిలాదేవి కాకతీ యుల కులదైవం మందిరం ఆనాడు ఉండడం ఊతమిస్తున్నది. కాకతీయులలో మూడవ రాజైన రెండవ బేతరాజు, మహా మండలే శ్వర మేడరాజుకు సామంతుడని శాసనాధారులున్నాయి. జగిత్యాల జిల్లాలో ఆర్వెల్లి (ఆరువేల గ్రామం)లో నేటికీ ఎత్తైన ఆర్వెల్లి నాయకమ్మ విగ్రహం కలిగి, ఏటా జాతర జరుగు తున్నది. బేతరాజు సబ్బి సహస్రం (ఆరువేల నాడు)ను పాలించాడని చరిత్రకారుల భావన. బేతరాజు తర్వాత రెండవ ప్రోల రాజు రాజై, జగిత్యాల సమీప పొల వాస రాజ్యాన్ని ఏలే మేడరాజును గెల్చి, సామంతునిగా నిలిపాడని, అలాగే మంత్రకూటపు (మంథెన) రాజైన గుండె రాజును గుండారం వద్ద ఓడించి, అవమాన పరిచాడని, గుండెరాజు, మేడరాజు అన్నదమ్ము లని పరిశోధనలు జరిగాయి.

ప్రోలుని తర్వాత రాజైన కాకతీయ రుద్రుడు నగునూరుపై దండెత్తి దొమ్మ రాజును ఓడించాక, పొలవాసపై దండెత్తగా, మేడరాజు పారిపోగా, హుస్నాబాద్ సమీప ఆకునూరుకు చేరుకుని, మూల సైనిక బలంతో మైళగి దేవుని కళ్యాణి వరకు తరిమిన క్రమంలో, రుద్రరాజు స్వతంత్రుడైన సందర్భం లో, యావదాంధ్రదేశం రుద్రుని పాలన కిందకు 1162లో వచ్చినట్లు చరిత్రకారులు తెలుగు ప్రజలందరిని ఒక్కటిగా చేసిన సంవత్సరం గా గుర్తించారు. మేడరాజు తమ్ముడగు ఏడెరాజు వేయించిన శాసనం రామగుండం వద్ద లభించుటచే ఏడెరాజు ఆప్రాంత సామంతుడుగా ఉండినట్లు అభి ప్రాయాలున్నాయి. గణపతి దేవుని కాలాన కరీంనగర్ జిల్లా మొత్తం సామంత పల్లవుల పాలనలో ఉండెనని తెలుస్తున్నది. గణపతి దేవుని తర్వాత రుద్రమ సింహాస నమెక్కింది. కాకతీయు లలో చివరివాడు ప్రతాప రుద్రుడు. స్థానిక కథనాల ప్రకారం పొలవాస ను పాలించిన మేడరాజు ఏకైక పుత్రిక సమ్మక్కను తన మేనల్లుడైన మేడారం పాలకుడగు పగిడిద్దరాజు తో వివాహం జరిపించాడు. వారికి సారలమ్మ నాగులమ్మ, జంపన్న అనే సంతానం కలిగారు. ప్రతాప రుద్రుడు పొలవాసపై దండెత్తగా, మేడరాజు పోరిపోయి, పగిడిద్ద రాజుకు ఆశ్రయుడైనట్లు, పడిగిద్ద రాజుపై ఆగ్రహించిన ప్రతాప రుద్రుడు మాఘ పౌర్ణమినాడు మేడారం పై దండెత్తినట్లు, మేడ రాజు, పగిడిద్ద రాజు, సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజు యుద్ధం లో వీరస్వర్గం పొందినట్లు, సమ్మక్క సైతం కాకతీయలతో వీరోచితంగా పోరుసల్పి, గిరిజన యుద్ధ తంత్రా న్ని ప్రదర్శించినట్లు ప్రచారంలో ఉంది. సమ్మక్క యుద్ధ భూమిలో కాకలు తీరిన కాకతీయుల సైన్యాన్ని ముప్పు తిప్పలు పెడుతుంది, వీరోచితంగా పోరాటం సాగించింది. గిరిజన మహిళ యుద్ధ నైపుణ్యానికి ప్రతాప రుద్రుడు ఆశ్చర్య చకితుడయ్యాడు. చివరికి శత్రువుల చేతిలో దెబ్బతిన్న సమ్మక్క రక్తపు ధారలతోనే యుద్ధ భూమి నుంచి నిష్క్రమించి చిలుక గుట్ట వైపు వెళు తూ మార్గ మధ్యంలోనే అదృశ్యమైంది. సమ్మక్కను వెదుక్కుంటూ వెళ్లిన అనుచరులకు ఆమె జాడ కనిపించలేదు, కానీ ఆ ప్రాంతములో ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమలు గల భరిణె లభించింది. దాన్ని సమ్మక్కగా భావించి అప్పటి నుంచి రెండేళ్లకు ఒకసారి పెద్ద జాతర, అలాగే మినీ జాతర మాఘ శుద్ధ పౌర్ణమి రోజున అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపు కుంటున్నారు. అవిభక్త కరీంనగర్ జిల్లాతో విడదీయరాని అను బంధం, సంబంధం కలిగిన సమ్మక్క - సారలమ్మలకు అత్యధికంగా వనదేవతల గద్దెలున్నాయి. దేవాదాయ శాఖలో రిజిస్ట్రేషన్ అయినవి కరీంనగర్ జిల్లాలో 41 కాగా, వరంగల్ జిల్లాలో 12 ఉన్నాయి. ఆదిలాబాద్ లో వేళ్ళపై లెక్కించేవి కాగా, ఇతర జిల్లాలలో బహుస్వల్పం. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను జనవరి 28 నుండి 31 వరకు నిర్వహించేందుకు కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర ఘనంగా జరుగనుంది. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సమ్మక్క- సారలమ్మ మేడారం జాతరలో భాగంగా నాలుగు రోజులపాటు వివిధ కార్యక్రమాలను అర్చకులు నిర్వహించ నున్నారు. నాలుగు రోజులలో ఏరోజు ప్రత్యేకత ఆ రోజుకు ఉంది. ఉత్తర తెలంగాణ నుండి అధిక సంఖ్యాకులైన భక్తులు ఈ జాతరకు సనాతన సంప్రదాయ వారసత్వ ఆచారంలో భాగంగా క్రమం తప్పకుండా వెళ్లడం పరిపాటి. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేవిధంగా ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. జనవరి 28 నుంచి 31 వరకు జాతర నాలుగు రోజుల పాటు జరుగుతుంది. తొలి రోజు జనవరి 28న సాయంత్రం 6 గంటలకు కన్నెపల్లి నుంచి సారలమ్మను, గోవింద రాజు, పగిడిద్ద రాజులను గద్దెపైకి తీసుకు రావడంతో జాతర ప్రారంభం అవుతుంది. రెండో రోజు 29న సాయంత్రం 6 గంటలకు చిలకల గుట్ట నుంచి సమ్మక్క దేవతను గద్దె మీదకు తీసుకొస్తారు. 30న వన దేవతలకు భక్తులు తమ తమ మొక్కులను చెల్లించే కార్యక్రమం ఉంటుంది. 31న సాయంత్రం 6 గంటల సమయంలో సమ్మక్క, సారలమ్మ దేవతలు, గోవింద రాజు, పగిడిద్ద రాజు దేవుళ్ల వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది.

# బోయినిపల్లి మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**- ప్రిన్సిపాల్ అరువ రఘునాథ్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 2026--27 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరువ రఘునాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలు ఏప్రిల్ 19న నిర్వహించనున్నట్లు తెలిపారు. 6వ తరగతికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతులకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్షలు ఉంటాయని చెప్పారు. ఆధునిక బోధన సదుపాయాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ల్యాబ్‌లు, ఉచిత పుస్తకాలు, యూనిఫాం, ఆర్టీసీ బస్సు సౌకర్యం కలదని తెలిపారు. దరఖాస్తు ఫీజు ఓపెన్ కేటగిరికి రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పిహెచ్సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.125గా నిర్ణయించినట్లు తెలిపారు. దరఖాస్తులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా చేయాలని కోరారు.

## అమ్మ నన్ను ఆశీర్వదించండి: మోరే రమేష్



భద్రాద్రి బ్యూరో (ప్రశ్న న్యూస్) రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న నన్ను ఆశీర్వదించండంటు 17 వ డివిజన్ కు చెందిన మోరే రమేష్ ఓటర్ లను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. 17 డివిజన్ కార్పొరేటర్ పోటీచేస్తున్నా తనకు మద్దతు ఇవ్వండి అంటూ ఇంటింటికి తిరిగి ఆశీస్సులు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తన భార్య మోరే రూప ఇక్కడ కౌన్సిలర్ గా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి పనులు తన గెలుపుకు దోహదం చేస్తాయని, డివిజన్ లో ప్రతి గడపతో తనకు ఆత్మీయ అనుబంధం ఉందని తనని ఇంటి బిడ్డగా ఆశీస్సులు అందిచి బంపర్ మెజారిటీతో గెలిపిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా తాను అందించిన సేవలు సైతం తన గెలుపుకు దోహదం చేస్తాయని చిన్న పెద్ద అందరూ తన వెంట ఉన్నారనే ధీమాను వ్యక్తం చేశారు

## స్మశాన వాటిక ను అభివృద్ధి చేయాలని వినతి



నాచారం(ప్రశ్న న్యూస్) నాచారం డివిజన్ లోని మాదిగ స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్ ను కలిసి మాదిగ స్మశాన వాటిక అభివృద్ధి సంఘం విజ్ఞప్తి చేసింది. డిప్యూటీ కమిషనర్ కు వినతి పత్రం అందించి గత 70 సంవత్సరాలుగా స్మశాన వాటిక లో అభివృద్ధికి నోచుకోలేదని కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా మాదిగ స్మశాన వాటిక అబివృద్ధి కి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ శ్మశాన వాటిక అభివృద్ధి సంఘం అధ్యక్షుడు ఏర్పుల నాగరాజు, ముఖ్య సలహాదారులు ఏర్పుల నర్సింగరావు, గౌడెల్లి శ్రీనివాస్ , ఏర్పుల నరేందర్, నాచారం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నూతలకంటి రాజు పాల్గొన్నారు.

## జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశం



మహబూబ్ నగర్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , మహబూబ్ నగర్ జిల్లా ఇంచార్జ్ శివంత్ రెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ అవేజ్ అహ్మద్ అధ్యక్షతన మంగళవారం రోజు జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,జిల్లా ఇన్చార్జీ శివంత్ రెడ్డి మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ విభాగాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని కోరారు. రానున్న మున్సిపల్ మరియు కార్పొరేషన్ సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృసి చేయాలని కోరారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆవేజ్ అహ్మద్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, మహేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శులు సంజీవ్ రెడ్డి, ఇంతియాజ్, ఇమ్రాన్, లక్ష్మణ్ నాయక్, ఫైజాన్, మహబూబ్నగర్ అసెంబ్లీ అధ్యక్షులు సల్మాన్, జడ్చర్ల అధ్యక్షులు శ్రీకాంత్, దేవరకద్ర అధ్యక్షులు లక్ష్మికాంత్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు సయ్యద్ ముస్తాక్అలీ, సోపియాన్, ఇర్ఫాన్ ,ప్రవీణ్, మండల అధ్యక్షులు రహీం ,శ్రీశైలం యాదవ్, షకీల్, గణేష్, క్రిష్ణ, ఆది, భూపతిరెడ్డి, నాయకులు సమీర్ హుస్సేన్, ఇమ్రాన్, శివ, ఆమెర్, కామ్రాన్, తాలిబ్, సిద్దిఖ్, మాసుమ్, సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

# “దీక్ష విరమణ”,త్వరలో భవిష్యత్తు కార్యాచరణ: ఎమ్మెల్యే





కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో గత ఎనిమిది రోజులుగా విలీనం పై”రిలే నిరాహారదీక్ష”చేపడుతున్న స్థానిక శాసనసభ్యులు శ్రీ గణేష్ నిన్న మంగళవారం సాయంత్రం 5 గంటలకు అనూహ్యంగా దీక్ష విరమించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ కంటోన్మెంట్ విలీనం అంశంపై అవగాహన రాహిత్యంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ విలీనం విషయంలో ద్వంద్వ వైఖరి ప్రదర్శించడం మానుకొని ప్రజల పక్షాన నిలబడాలని సూచించారు. కంటోన్మెంట్ విలీనం కోరుతూ చేస్తున్న రిలే నిరాహార దీక్ష 8వ రోజుకు చేరుకుంది. కంటోన్మెంట్ లోని ప్రజలు దీక్షకు మద్దతుగా సంఘీభావం ప్రకటిస్తున్నారని ఆయన అన్నారు. బాధ్యత గల ఎంపీ హోదాలో ఉన్న ఈటెల రాజేందర్ కంటోన్మెంట్ ప్రజల పక్షాన పార్లమెంటులో గళం విప్పలేని దుస్థితిలో ఉన్నారని తెలిపారు. కంటోన్మెంట్ ఎన్నికల కోసం కేంద్రంతో సంప్రదిస్తున్నానని చెబుతున్న ఈటల రాజేందర్ విలీనం విషయంలో తన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. అలాగే నిన్న విలేకరుల సమావేశంలో కంటోన్మెంట్ విలీనానికి ఈటెల రాజేందర్ కూడా సానుకూలంగానే ఉన్నట్లు స్పందించారని ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు. గత 30 సంవత్సరాలుగా కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న నాయకులు కంటోన్మెంట్ ప్రాంతం గురించి పట్టించుకున్న పాపాన పోలేదని, ఇప్పుడు మాత్రం రాజకీయ లబ్ధి కోసం విలేకరుల సమావేశంలో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న కాలనీ వాసులు సైతం విలీనం కోసం జేఏసీలు ఏర్పాటు చేసుకొని ఉద్యమ కార్యాచరణ చేపట్టేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు.

**దీక్ష శిబిరంలో భాజపాను ఎండ కట్టిన ప్రముఖులు:**

కేంద్ర ప్రభుత్వం వెంటనే కంటోన్మెంట్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం కోసం పోరాడుతున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మొదటి అడుగులో భాగంగా చేస్తున్న రిలే నిరహార దీక్షను నిన్న సాయంత్రం ముగించారు. చివరి రోజు దీక్షకు తెలంగాణ ఫిషరీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్,టిపిసిసి జనరల్ సెక్రటరీలు నర్సారెడ్డి భూపతి రెడ్డి,పృధ్వీ చౌదరి, బియస్పి నాయకులు రాజేందర్ వారి సంఘీభావాన్నితెలియజేశారు. రిలే నిరాహార దీక్ష ముగింపు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయాలని చేస్తున్న పోరాటంలో భాగంగా కంటోన్మెంట్ ప్రజలు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు భారీ స్పందన లభించింది. నియోజకవర్గ ప్రజలు, మేధావులు,కవులు, కళాకారులు,నాయకుల భారీ మద్దతుతో రిలే నిరహార దీక్ష పూర్తి చేశాం.

ఈ ఉద్యమం భవిష్యత్తులో మరింత రూపాంతరం చెంది వివిధ రూపాల్లో కంటోన్మెంట్ బోర్డు విలీనం కోసం పోరాటం కొనసాగుతుంది ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రజాస్వామ్యంలో ఏదీ ఒక్కరోజులో సాధ్యం కాదని స్పష్టం చేశారు. దేశ స్వాతంత్ర పోరాటమైనా,తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంమైనా ఎన్నో ఏళ్ల పాటు కొనసాగి ప్రజల మద్దతుతో విజయవంతం అయ్యాన విషయం గుర్తు చేశారు. మేము కూడా ఆ ఉద్యమాలను స్ఫూర్తిగా తీసుకుని ఈ కంటోన్మెంట్ బోర్డు విలీన పోరాటాన్ని భవిష్యత్తులో మేధావులు, పెద్దలందరితో చర్చించి వివిధ రూపాల్లో ఉద్యమాన్ని కొనసాగించి విలీనం దిశగా అడుగులు వేస్తామన్నారు. కంటోన్మెంట్ ప్రజల పోరాటంతో కంటోన్మెంట్ బోర్డులో ఎన్నికలు లేకుండా నామినేటెడ్ వ్యవస్థతో ప్రజాస్వామ్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఖూనీ చేస్తున్న తీరును ఈటల రాజేందర్ కూడా ఒప్పుకోవడం విశేషం. ఈ రిలే నిరాహార దీక్ష ద్వారా కంటోన్మెంట్ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న తీరు రాష్ట్రవ్యాప్తంగా, జాతీయ మీడియా ద్వారా దేశవ్యాప్తంగా చర్చకు జరిగింది అదే మా మొదటి విజయంగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగేఇది మా కంటోన్మెంట్ ప్రాంత ప్రజల మొదటి విజయం కంటోన్మెంట్ విలీన పోరాటానికి ఈ రిలే నిరాహార దీక్ష తొలి మెట్టు,కంటోన్మెంట్ బోర్డు రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం అయితే కంటోన్మెంట్ ప్రాంత ప్రజలకు ప్రయోజనాలను ఈ రిలే నిరాహార దీక్ష ద్వారా అందరికీ తెలియడం మేం సాధించిన మొదటి విజయం. ఎంపిఈటెల రాజేందర్ ఇప్పటికైనా కంటోన్మెంట్ ప్రాంత ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి విలీన ప్రక్రియ మొదలు పెట్టాలి అన్నారు. భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తాం,రాబోయేది కాలం కంటోన్మెంట్ బంగారు భవిష్యత్తు. అదిగాకమా ప్రాంత ప్రజల పోరాటానికి మద్దతు తెలిపి సంఘీభావంగా దీక్షా శిబిరానికి వచ్చి మా ప్రాంతిప్రజల అభివృద్ధి కోసం మా అడుగులో అడుగు వేసి మా అందరికీ వెన్నుదన్నుగా నిలిచిన నాయకులు, వివిధ ప్రజా సంఘాలు, మేధావులు, కవులు, కళాకారులు అందరికీ మా నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఎమ్మెల్యే శ్రీ గణేష్. ఈ కార్యక్రమంలో వికాస్ మంచు నేత సంకీ రవిందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్ బద్రీనాథ్ యాదవ్ సంతోష్ యాదవ్ రాజేష్ యాదవ్ మురళీ ముదిరాజ్, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్, వైస్ చైర్మన్ వేణు గోపాల్ రెడ్డి, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు శరత్ కుమార్ ప్రభాకర్,రవి, అడ్వకేట్ వినోద్, భాస్కర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి




నిజామాబాద్(ప్రశ్న న్యూస్) మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం బోధన్ పట్టణంలోని విజయ మేరీ హైస్కూల్ లో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం బోధన్ మున్సిపాలిటీకి సంబంధించిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కోసం విజయ మేరీ పాఠశాలలో అనువుగా ఉన్న ఆయా విభాగాల గదులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలన జరిపారు. సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ ఇతర అధికారులతో డిస్ట్రిబ్యూషన్ కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ సాఫీగా జరిగేలా, అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రిపోలింగ్ కు ఆస్కారం ఉండకూడదని అన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ విఠల్, సంబంధిత అధికారులు ఉన్నారు.

## తెలుగు, ఆంగ్లం విభాగాల జాతీయ సదస్సుల కరపత్రాలు ఆవిష్కరించిన తె.వి.వి. ఉపకులపతి యాదగిరి రావు




నిజామాబాద్(ప్రశ్న న్యూస్) జి.జి. కళాశాల తెలుగు విభాగం మార్చి 6వ తేదీన “తెలుగు మాండలిక సాహిత్య వికాసం; విస్తృతి, వైవిధ్యం” అనే అంశంపై, ఆంగ్ల విభాగం మార్చి 12వ తేదీన “కృత్రిమ మేధతో ఆంగ్ల భాషా బోధనను మార్చడంలో అవకాశాలు, సవాళ్లు, భవిష్యత్తు మార్గాలు” అనే అంశంపై రూసా ఆర్థిక సౌజన్యంతో జరుపబోయే ఒకరోజు జాతీయ సదస్సుల కరపత్రాలను సోమవారం తెలంగాణ విశ్వవిద్యాలయం ఉపకులపతి యాదగిరి రావు ఆవిష్కరించారు. మాండలికాలతో వెలువడిన సాహిత్యాన్ని, ప్రక్రియలను అధ్యయనం చేయడం, ఆంగ్ల భాషా బోధనలో కృత్రిమ మేధ పరిణామాలు, రెండు అంశాలు కూడా అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత గల అంశాలను ఎంచుకున్నారని ఉపకుపతి కన్వీనర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ యాదగిరి, కళాశాల ప్రిన్సిపల్ డా. పి. రామ్మోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.ఎస్.రంగరత్నం, తెలుగు ఆచార్యులు లావణ్య, కనకయ్య, లక్ష్మణ చక్రవర్తి, ఆంగ్ల విభాగం ఆచార్యులు కె.వి.రమణాచారి, సమత, సదస్సు కన్వీనర్లు లెఫ్టినెంట్ రామస్వామి, దండుస్వామి అధ్యాపకులు ఐ.గంగాధర్, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే శ్రీ గణేష్ పై భాజపా నేత ఆర్కే ఫైర్




కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో రాజకీయ నాటకాలు ఎక్కువ అయ్యాయి. ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారని, వాస్తవాలు సమాధి చేసి లబ్ధి పొందాలని ప్రయత్నం చేస్తున్నారు. అలాగే కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ విలీనం పేరిట చేస్తున్న దీక్ష కట్టు కథేనని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు,భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ అన్నారు. కంటోన్మెంట్ ప్రాంతం జిహెచ్ఎంసిలో విలీనం అయితే దుష్పరిణామాలు ఎక్కువగా ఉంటాయని వెల్లడించారు. కంటోన్మెంట్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ దీక్షల పేరుతో మభ్యపెట్టే ప్రయత్నం మానుకోవాలని హెచ్చరించారు. ప్రశాంతంగా ఉన్న కంటోన్మెంట్ ప్రాంతాన్ని జిహెచ్ఎంసిలో కలపడం మూలంగా పచ్చదనం కనుమరుగు కావడంతోపాటు పూర్తిగా కాంక్రీట్ అడవిగా మారే అవకాశం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి సమగ్ర అభివృద్ధి చేస్తే కంటోన్మెంట్ ప్రాంతాన్ని జిహెచ్ఎంసిలో కలపాల్సిన అవసరం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలో ఇతర నియోజకవర్గాల మాదిరిగా అభివృద్ధి చేయకుండా కంటోన్మెంట్ ను నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ ఎన్నికలు, విలీనం అంశాలు కేంద్ర పరిధిలో ఉన్నాయని ఆర్మీ ఆధీనంలో కంటోన్మెంట్ ప్రాంతం ఉన్న నేపథ్యంలో ఆలోచించి సమయాను గుణంగా నిర్ణయం తీసుకుంటారని అన్నారు. కంటోన్మెంట్లో నూతన చట్టాలను తీసుకువచ్చే ప్రతిపాదనను కేంద్రం సిద్ధం చేసిందని అది పార్లమెంటులో ఆమోదం పొందే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎన్నికలు జరపాలా వద్దా అనేది సందిగ్ధంలో ఉన్నట్లు తెలిపారు. కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న లీజు భూములు బంగ్లాలను దోచుకోవాలనే కుట్రతో విలీనానికి తెరలేపారని అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి గతంలో ఎంపీగా పనిచేసిన నేపథ్యంలో కంటోన్మెంట్ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైనే ఉందని గుర్తు చేశారు. విలీనం జరగాలని కోరుకుంటున్న పొన్నం ప్రభాకర్ కు కంటోన్మెంట్ ప్రాంతం పై ప్రజల సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే కంటోన్మెంట్ ప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అదిగాక సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న ప్రజలు “మేర్జ్” కోరుకోవడం లేదని, అనవసరమైన రాద్ధాంతం స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ చేస్తున్నారని ఆర్కే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ధనుంజయ చారి,నర్సింహా రావు,టోపీ శంకర్,అశోక్, నాగభూషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేధింపులపై కఠిన చర్యలు

## సీపీ సజ్జనార్ భరోసా

ఎవరైనా వేధింపులకు గురైతే మౌనంగా భరించవద్దని, పోలీసుల అండ ఎప్పుడూ ఉంటుందని హైదరాబాద్ సీపీ సజ్జనార్ భరోసా ఇచ్చారు. ముఖ్యంగా ఆడపిల్లలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధితులు భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. 9490616555 నంబరుకు వాట్సప్ ద్వారా లేదా 100కు డయల్ చేస్తే తక్షణ స్పందన ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



# ఐదు భాషల్లో 'త్రిముఖ'

యోగేష్ కల్లె హీరోగా, సన్నీ లియోన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'త్రిముఖ'. అకృతి అగర్వాల్, అఎఆ ఆదిత్య శ్రీవాస్తవ, మొట్టా రాజేంద్రన్, ఆశు రెడ్డి, సాహితీ దాసరి, ప్రవీణ్, షకలక శంకర్, సుమన్, రవి ప్రకాష్, జీవా, సమ్మెట గాంధీ, జెమినీ సురేశ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని అఖిరా డ్రీమ్ క్రియేషన్స్ బ్యానర్ ద శ్రీదేవి మద్దాలి, రమేష్ మద్దాలి నిర్మిస్తున్నారు. ఈ మూవీకి రాజేష్ నాయుడు దర్శకత్వం వహిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఐదు భాషల్లో ఏకకాలంలో చిత్రీకరించిన ఈ పాన్ ఇండియా మూవీని ఈ నెల 30న రిలీజ్ చేయనున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన డైరెక్టర్ రాజేశ్ నాయుడు..'ఒక మంచి కథతో, బలమైన స్క్రీన్ ప్లేతో 'త్రిముఖ' చిత్రాన్ని రూపొందించాను. మూవీ ఫస్టాఫ్ అంతా ఎంటర్‌న్ చేస్తుంది. సెకండాఫ్ తల పక్కకు తిప్పనంతగా ఎంగేజింగ్‌గా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. సినిమాలోని ప్రతి క్యారెక్టర్‌కు ఇంపార్టెన్స్ ఉంటుంది. ప్రతి పాత్ర ఒక మంచి విషయాన్ని తెలియజేస్తుంది. రొటీన్ సినిమాలకు తప్పకుండా భిన్నంగా ఉండేలా ప్రయత్నించాం. యోగేష్‌కు నటుడిగా పేరు తెచ్చే మూవీ అవుతుంది' అని తెలిపాడు.

## రోడ్డు ప్రమాదంలో తనను కోల్పోయా

బాలీవుడ్ క్యూట్ హీరోయిన్ అలియా భట్ చిన్నతనంలో తాను అనుభవించిన అత్యంత పెయిన్‌ఫుల్ ఇన్సిడెంట్‌ను గుర్తు చేసుకుంది. విషాదకరమైన రోడ్డు ప్రమాదంలో తన బామ్మను ఏవిధంగా కోల్పోయిందో చెప్పుకొచ్చింది. అప్పటి ఇన్సిడెంట్ గురించి చెప్తూ ఎమోషనల్ అయిన అలియా.. ఈ యాక్సిడెంట్ తమ ఫ్యామిలీపై చాలా ప్రభావం చూపిందని, రోడ్ సేఫ్టీ పట్ల తన అవగాహనను పెంచిందని తెలియజేసింది. అలియాకు 12 ఏళ్ల వయసున్నపుడు ఆమె బామ్మ(నానీ) తన భర్తతో కలిసి గుడికి వెళ్తుండగా ట్రక్ ఢీకొట్టడంతో స్పాట్‌లో చనిపోయినట్లు వెల్లడించింది. అప్పటి నుంచి తమ ఫ్యామిలీ ఒకలాంటి భయం పెరిగిపోయిందని, ప్రత్యేకించి తన సేఫ్టీ పట్ల తల్లి ఆందోళన చెందేదని చెప్పింది. అయితే అప్పుడు సేఫ్టీ పాటించినా, తాను తల్లి అయిన తర్వాత సేఫ్టీ విషయంలో తన దఅక్పథం మారిందని.. తన బిడ్డ కోసమైనా మరింత బాధ్యతగా ఉంటున్నట్లు తెలిపింది.



## తెలుగులో హాట్‌స్పాట్‌టు మచ్



తమిళంలో 2024లో విడుదలై మంచి విజయం సాధించింది 'హాట్‌స్పాట్ మొదటి భాగం. తాజాగా శుక్రువారం రిలీజ్ అయిన 'హాట్ స్పాట్ రెండో భాగం కూడా ఘన విజయం సాధించింది. మొదటి మూడు రోజుల్లో 2 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్ట్ చేసి చిన్న చిత్రాల్లో పెద్ద విజయంగా రికార్డ్‌క్రియేట్ చేసింది. ముఖ్యంగా అర్బన్ యూత్‌ను ఆకట్టుకొని మల్టీప్లెక్స్ థియేటర్స్‌లో హౌస్‌ఫుల్‌గా నడుస్తోంది. హాట్‌స్పాట్‌మొదటి భాగం తెలుగులో ఆహా ఓటిటి ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్‌అవుతోంది. 'హాట్ స్పాట్ 2 మచ్ సినిమా తెలుగు డబ్బింగ్ వెర్షన్ ఫేబ్రవరి 13న వాలంన్స్ డే సందర్భంగా రిలీజ్‌చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌శ్రీనివాసమూర్తి తెలిపారు. ప్రియా భవాని శంకర్, ఏం ఎస్ భాస్కర్, తంబి రామయ్య, అశ్విన్ కుమార్ నటించిన ఈ చిత్రానికి నిర్మాత అనిల్ కే రెడ్డి కాగా దర్శకుడు విఘ్నేశ్‌కార్తిక్



# బాధ్యతలన్నీ మగాడిపైనే వేయొద్దు..

బ్యూటిఫుల్ రేజీనా భాగస్వామి బాధ్యతల గురించి చెప్పిన మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. హీరోయిన్‌గా అవకాశాలు అందుకుంటూనే రియాలిటీ డ్యాన్స్ షోకు జడ్జిగా వ్యవహరిస్తున్న ఆమె..రిలేషన్‌లో ఉన్నప్పుడు అమ్మాయి, అబ్బాయి ఎలా నడుచుకోవాలో తన అభిప్రాయాన్ని ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. 'నువ్వే అన్నీ చేయాలంటూ అమ్మాయిలు పార్ట్‌నర్‌ద ఒత్తిడి పెట్టడం తప్పు. ఇది అన్యాయం. మెంటల్ హెల్త్ ముఖ్యం. ఒకరి మానసిక ఆరోగ్యం బాగోలేకపోతే, మరొకరు అన్ని బాధ్యతలు ఒక్కడే భరించాలని ఎక్స్‌పెక్ట్ చేయకూడదు. దీన్ని రెండు వైపులా అర్థం చేసుకోవాలి. పార్ట్‌నర్‌మెజీషియన్‌కాదు. లైఫ్‌లో వాళ్లకి చాలా ఇష్యూస్ ఉంటాయి. వాళ్లకీ వాళ్ల సమస్యలు, ఒత్తిడి, లిమిటేషన్స్ ఉంటాయి. అందుకే రెస్పాన్సిబిలిటీస్ షేర్‌చేసుకోవాలి, ఒకరిని ఒకరు సపోర్ట్ చేసుకోవాలి – ఒకరు మాత్రమే అన్నీ భరించాలని అనుకోకూడదు' అని చెప్పుకొచ్చింది. దీంతో ఆమెపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు నెటిజన్లు.

# ఆ ఫీలింగ్ రాదు..



తరుణ్ భాస్కర్ లీడ్ రోల్‌లో నటిస్తున్న హిలేరియస్ విలేజ్ కామెడీ ఎంటర్‌నర్ 'ఓం శాంతి శాంతి శాంత్ఙి'. ఈషా రెబ్బా హీరోయిన్‌గా నటిస్తున్నారు. సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్ పై సఅజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు ఈ వెంచర్‌ను నిర్మిస్తుండగా, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 30న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈషా రెబ్బా డియాతో ముచ్చటించారు.–'ఇది రీమేక్. ఇలాంటి సినిమా నాకు రావడం చాలా ఆనందంగా అనిపించింది. ఈ సినిమా ఒరిజినల్ నాకు చాలా ఇష్టం. అందులో హీరోయిన్ క్యారెక్టర్ నాకు చాలా నచ్చింది. ఇది అందరూ యూనివర్సల్‌గా కనెక్ట్ అయ్యే స్టోరీ.మన తెలుగు నేటివిటికి తగ్గట్టు కథలో, పాత్రల్లో చాలా మార్పులు చేశారు. ఇందులో ఉండే ఎమోషన్స్ అందరు కూడా కనెక్ట్ అయ్యేలాగా ఉంటాయి. సినిమా చూస్తున్నప్పుడు రీమేక్ అనే ఫీలింగ్ రాదు. ఇందులో అన్ని క్యారెక్టర్స్‌కి ఆడియన్స్ రిలేట్ అవుతారు.-నాకు శాంతి క్యారెక్టర్ చేయడం చాలా ఎగ్జైటింగ్‌గా అనిపించింది. ఇలాంటి క్యారెక్టర్ చేయాలని ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నాను. కెరీర్‌లో ఒక్కసారైనా ఇలాంటి పాత్ర వస్తే చేయాలని అనుకునేదాన్ని. ఈ సినిమాతో ఆ కోరిక తీరింది. ఈ సినిమాకి హండ్రెడ్ పెర్సెంట్ ఎఫర్ట్ పెట్టాను.-ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఇందులో మెయిన్ కాన్ఫ్లిక్ట్‌ని చాలా ఫన్నీగా అలాగే ఎంటర్టైనింగ్‌గా చెప్పడం జరిగింది. ఎక్కడ కూడా మెసేజ్ ఇచ్చినట్లుగా ఉండదు. తరుణ్ భాస్కర్ గారితో వర్క్ చేయడం చాలా హ్యాపీ.

## పాత్రలతోనే తన స్థాయిని నిరూపించుకుంటున్న నటుడు

నటుడు నవదీప్ పుట్టినరోజు సందర్భంగా, తెలుగు సినీ పరిశ్రమలో పాత్రాధారిత సినిమాలకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిన ఓ విశిష్ట నటుడిని స్మరించుకునే సందర్భమిది. కథను, పాత్రను ముందుంచే ఎంపికలతో, భయంలేని నటనతో తనదైన ప్రయాణాన్ని కొనసాగిస్తూ, నిలకడైన అభిరుచిగల నటుడిగా నవదీప్ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.తన తాజా చిత్రం 'దండోరా' లో నవదీప్ చేసిన పాత్ర ఆయన కెరీర్‌లోనే అత్యుత్తమ నటనలలో ఒకటిగా ప్రశంసలు అందుకుంటోంది. భావోద్వేగ నియంత్రణ, సహజ నటన, అంతర్గత సంఘర్షణను ఆవిష్కరించిన తీరు కథకు బలంగా నిలిచింది. ఈ పాత్ర ద్వారా నటుడు కనిపించకుండా, పాత్ర మాత్రమే ప్రేక్షకుల ముందు నిలిచేలా చేశారు.'దండోరా'లో నవదీప్ నటనకు ప్రేక్షకులు, విమర్శకులు మంచి స్పందన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఆయన పాత్రాధారిత నటనకు మరో నిదర్శనం. ఇక రాబోయే ప్రాజెక్టస్ ద్వారా నవదీప్ మరిన్ని విభిన్నమైన, శక్తివంతమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. కంటెంట్ ప్రాధాన్యత కలిగిన సినిమాల్లో విశ్వసనీయ నటుడిగా ఆయన ప్రయాణం కొనసాగుతోంది.



## సైన్స్‌ఫిక్షన్‌తో వస్తున్న నితిన్

వైవిధ్యమైన సినిమాలు, పాత్రలతో తనదైన గుర్తింపు సంపాదించుకున్న హీరో నితిన్‌తన 36 సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడు. వెర్సల్‌డైరెక్టర్‌వి.ఐ.ఆనంద్‌ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. పవన్‌కుమార్‌సమర్పణలో సక్సెస్‌ఫుల్ బ్యానర్‌శ్రీనివాస సిల్వర్‌స్క్రీన్‌పై శ్రీనివాస చిట్టూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రథ సప్తమి సందర్భంగా సైన్స్ ఫిక్షన్‌ఎంటేర్‌నర్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. విభిన్నమైన కథలు, కథనాలతో సినిమాలను రూపొందించే దర్శకుడు వి.ఐ.ఆనంద్‌మరోసారి ఈ భారీ ప్రాజెక్ట్‌తో క్రియేటివ్‌బౌండరీస్‌రేంజ్‌ను మరింత పెంచటానికి సిద్ధమయ్యారు. సినీ ప్రేక్షకులకు ఇప్పటి వరకు చూడని సరికొత్త సినిమాటిక్‌ఎక్స్‌పీరియెన్స్‌ను ఇచ్చేలా ఈ క్రేజీ సినిమా రూపొందనుంది. 'ఊరు పేరు భైరవకోన' చిత్రం తర్వాత ఈ విజనరీ డైరెక్టర్ హై కాన్సెప్ట్ సైఫై ఎంటర్‌నర్‌తో ప్రేక్షకులను మెప్పించనున్నారు. త్వరలోనే షూటింగ్ స్టార్ట్ కానుంది.



# కన్నుల పండుగ మల్లన్న స్వామి జాతర.

**మల్లన్న స్వామి,ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి.**

**మాజీ డిప్యూటీ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి.**

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో మల్లన్న గుట్ట వద్ద మల్లన్న స్వామి జాతర మరియు ఎల్లమ్మ తల్లి కళ్యాణం యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్,బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్ రెడ్డి, మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ కంఠరెడ్డి. తిరుపతి రెడ్డి, నాయకులతో కలసి ఎల్లమ్మ తల్లి కళ్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మల్లన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మల్లన్న స్వామి ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూసుభిక్షంగా ఉండాలన్నారు. రామాయంపేట ప్రజలపై మల్లన్న స్వామి, ఎల్లమ్మ తల్లి దయ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. వర్షాలు బాగా పడి రైతులు కూడా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. మల్లన్న స్వామి ఆలయానికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఘనంగా మల్లన్న స్వామి జాతర, ఎల్లమ్మ తల్లి కళ్యాణం నిర్వహిస్తున్న యాదవ సంఘం నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె. జితేందర్ గౌడ్, వైస్ చైర్ పర్సన్ పుట్టి. విజయలక్ష్మి, (తాజా మాజీ పిఎసిఎస్ చైర్మన్ బాదే. చంద్రం, మాజీ సర్పంచ్ ప్రభావతి, నాయకులు పుట్టి. యాదగిరి, కృష్ణ గౌడ్, నర్సారెడ్డి, రామాయంపేట పట్టణ, మండల



నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి అంబేద్కర్ యూత్ సేవా సంకల్పం

- విద్యే ఆయుధంగా సామాజిక మార్పు
- ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తా
- అంబేద్కర్ యూత్ సభ్యులు, న్యాయవాది : కన్నం సుదర్శన్
-అనంతపల్లిలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, అనంతపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల వేదికగా అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, రాజ్యాంగ రూపకర్త డా. బి.ఆర్. అంబేద్కర్ సేవలను గుర్తు చేశారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలను అందించిందని అంబేద్కర్ యూత్ సభ్యులు, న్యాయవాది,ఉన్నత విద్యా వేత్త కన్నం సుదర్శన్ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బుక్స్, పెన్స్, కంపాస్ బాక్సులను, అంగన్వాడీ విద్యార్థులకు స్లేట్లు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రతి ఆదివారం తాను ప్రత్యేకంగా గురుకుల, సైనిక్, నవోదయతో పాటు గ్రామంలోని ఐదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సేవా కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భావండ్ల కమలాకర్, గడ్డం వినయ్, కన్నం నవీన్, మల్లరపు గణేష్, గంగాధర, నరేష్, సురేష్, బత్తిని మహేష్, తోడేటి శ్రీకాంత్, మనోజ్, నితిన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు మరియు 10,000రూపాయల జరిమానా

**మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు**

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) హత్య కేసులో నిందితుడికి జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు 10000 రూపాయల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు తెలిపారు. ఎస్పీ పూర్తి వివరాలు వెల్లడిస్తూ బీహార్ రాష్ట్రానికి చెందిన సునీల్ మాంజి జీవనోపాధి కోసం ముపిరెడ్డిపల్లి గ్రామానికి వచ్చి, గ్రామ శివారులో ఉన్న ఎవీ ఆగ్రో కంపెనీలో వెల్డర్‌గా పనిచేస్తున్నారు. రెండు సంవత్సరాల తర్వాత ఆయన రెండవ తమ్ముడు ధనుంజయ్ కూడా అదే కంపెనీలో వెల్డర్‌గా చేరాడు. కొద్ది రోజుల తర్వాత మూడవ తమ్ముడు సర్వన్ కుమార్ వచ్చి రూమ్‌లో ఉంటున్నాడు.

20.04.2024 తేదీ రాత్రి సమయంలో, వారి బంధువులైన సంజయ్, ఓం ప్రకాష్ రాయ్‌లతో కలిసి సర్వన్ కుమార్ కిరాణా సరుకులు తీసుకురావడానికి వెళ్లారు. కొద్దిసేపటికి సంజయ్ మాత్రమే రూమ్‌కు తిరిగి వచ్చాడు. అనంతరం సర్వన్ కుమార్ ను వెతకడానికి వెళ్లగా ఎవీ ఆగ్రో కంపెనీ సమీపంలో సర్వన్ కుమార్ తలపై ఓం ప్రకాష్ రాయ్ బండ రాయితో కొట్టి హత్య చేసి, పారిపోయినట్లు గుర్తించారు. ఈ ఘటనపై మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కరుణాకర్ రెడ్డి కేసు నమోదు చేయగా, అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ కృష్ణ సమగ్ర దర్యాప్తు నిర్వహించి, కీలక సాక్ష్యాధారాలను సేకరించారు. పూర్తి సాక్ష్యాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి నీలిమ , నిందితుడు ఓం ప్రకాష్ రాయ్‌కు జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. 10,000 జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ సమర్థవంతంగా వాదనలు వినిపించగా, లైసనింగ్ ఆఫీసర్ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ మహిపాల్ రెడ్డి కేసు విచారణలో



సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## గ్రామీణ యువత ప్రతిభ వెలికితీసే దిశగా సీఎం కప్ లక్ష్యం

- సీఎం కప్ టోర్నమెంట్ కు ఏర్పాట్లు పూర్తి
- బోయినిపల్లి ఎంపీడీఓ : భీమా జయశీల



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలో నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా టోర్నమెంట్ కు సంబంధించి మంగళవారం మండల కమిటీ సమావేశం నిర్వహించి టోర్నమెంట్ నిర్వహణపై పలు కీలక తీర్మానాలు చేయడం జరిగిందని బోయినిపల్లి ఎంపీడీఓ భీమా జయశీల వెల్లడించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు, తేదీ 28 జనవరి 2026న ఉదయం 9.00 గంటలకు బోయినిపల్లి మండల కేంద్రంలోని జడ్పీ హై స్కూల్ పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా టోర్నమెంట్ ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో భాగంగా 28 జనవరిన కబడ్డీ (ఓపెన్ కేటగిరి), వాలీబాల్ (అండర్-18) పోటీలు, 29 జనవరిన ఖోఖో (అండర్-18), అథ్లెటిక్స్ (14 నుండి 21 సంవత్సరాల వరకు వయోకేటగిరీల వారీగా) క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ జయశీల మాట్లాడుతూ"గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికితీయడమే సీఎం కప్ టోర్నమెంట్ ప్రధాన లక్ష్యం. మండలంలోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడా పోటీలలో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలి. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణను, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయి" అని అన్నారు. ఈ సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన మండల కమిటీలో మండల అభివృద్ధి అధికారి జయశీల చైర్మన్‌గా, మండల విద్యాధికారి శ్రావణ్ కుమార్ కన్వీనర్‌గా వ్యవహరిస్తుండగా, మండల తహసీల్దార్ నారాయణ రెడ్డి, మండల రక్షకబట అధికారి (ఎస్సై), స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు,మండల సీనియర్ క్రీడాకారులు సభ్యులుగా ఉన్నారు.

## బూరుగుపల్లి గ్రామానికి రెండు బోర్లు మంజూరు -విజయవంతం - కృతజ్ఞతలు

- కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందనతో రెండు బోర్లు మంజూరు - విజయవంతం
- భాజపా నేతలు : సాయి అక్షిత్, పెంచాల సౌమ్య - మహేష్

బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి తాగునీటి అవసరాల దృష్ట్యా రెండు బోర్లు మంజూరు చేసిన నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ కు భాజపా జిల్లా నేత సాయి అక్షిత్, గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య-మహేష్ హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలోని మహిళా సంఘాలు, ప్రజలకు శుద్ధ జలాలను అందించాలనే లక్ష్యంతో వాటర్ ప్లాంట్ కోసం బోర్లు మంజూరు చేయాలని కేంద్రమంత్రిని కోరగా, ఆయన ఎలాంటి ఆలస్యం లేకుండా సానుకూలంగా స్పందించి రెండు బోర్లకు అనుమతి ఇచ్చారని తెలిపారు. బోర్లు వేయగా రెండూ విజయవంతంగా నీరు లభించడంతో గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య తీరనున్నదని పేర్కొన్నారు.





ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి సహకరించిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్?కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డితో కలిసి మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రాణి కుముదిని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అన్ని కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తూ, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయాలని, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. సరిపడా సిబ్బంది, బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు, పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అదనపు కలెక్టర్ నగేష్ , జెడ్పి సీఈవో ఎల్లయ్య డిఆర్డిఓ శ్రీనివాసరావు, డీఎస్పీలు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల అధికారులు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జోగినిపల్లి సంతోష్ కుమార్ సంఘీభావం దిశగా అనుముల భాస్కర్

- చట్టాన్ని గౌరవించే నాయకుడు జోగినిపల్లి సంతోష్ కుమార్
- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ మంగళవారం సెట్ నేపథ్యంలో మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ తదితర నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి కొనుకటి లచ్చిరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, గ్రామ ఉప సర్పంచ్ కుసుంబ మహేందర్, వార్డు మెంబర్ కొనుకటి కమలాకర్, ఉమారెడ్డి అనిల్, సీనియర్ నేత ముద్దం రవిందర్ గౌడ్, రెడ్డి పెంతల బాల్ రెడ్డి, ఎర్ర శ్రీనివాస్, అనుముల హరీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, "ప్రజా ఉద్యమాల నుంచి పార్లమెంట్ వరకూ సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన జోగినిపల్లి సంతోష్ కుమార్ విచారణకు హాజరుకావడం ఆయన ప్రజాస్వామ్యంపై, న్యాయవ్యవస్థపై ఉన్న గౌరవానికి నిదర్శనం. చట్టాన్ని గౌరవించే నాయకుడిగా ఆయన ఎప్పుడూ నిలిచారు. నిజం తప్పకుండా బయటకు వస్తుందన్న నమ్మకం మాకు ఉందన్నారు.

## ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దిల్‌సుఖ్‌నగర్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు .ఈ సందర్భంగా శివాంత్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులు, బాధ్యతలను గుర్తు



చేసుకుంటూ దేశాభివృద్ధికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలతో దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దిల్‌సుఖ్‌నగర్ ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, ప్రముఖులు పాల్గొని గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# జిహెచ్ఎంసి పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌ల గందరగోళం

**కాగితాలకే పరిమితమైన నియమ నిబంధనలు**

**సెల్లార్లలో వ్యాపారాలు అధికారులకు కనిపించడం లేదా.?**

**సెల్లార్ వ్యాపారాలతో రోడ్లపై వాహనాల పార్కింగ్, నిత్యం జామ్**







హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ లోమున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిధిలో ట్రేడ్ లైసెన్ల జారీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. నిబంధనలు ఉన్నాయన్న మాటలు ఫైళ్లలోనే మిగిలిపోతుండగా, క్షేత్రస్థాయిలో మాత్రం ఇష్టారాజ్యంగా లైసెన్లు జారీ అవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ శాఖ రూపొందించిన ట్రేడ్ లైసెన్స్ నియమ నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని స్థానికులు మండిపడుతున్నారు. నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా, నిబంధనలకు వ్యతిరేకంగా సెల్లార్‌లలో వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్లు జారీ అవుతుండటం తీవ్ర ఆందోళనకు దారి తీస్తోంది. జిహెచ్ఎంసి లో ట్రేడ్ లైసెన్లు అంటే అంగట్లో సర్కులాగా మారాయని అక్రమ వ్యాపారాలు చేసేవారు కూడా ట్రేడ్ లైసెన్ తీసుకొని యదేచ్ఛగా వ్యాపారాలు నిర్వహించడం విస్మయాన్ని కలిగిస్తుంది మరి ఉన్నత అధికారులు అవినీతి అక్రమాలను ప్రోత్సహించడం చూస్తుంటే ఈ ట్రేడ్ లైసెన్ జారీలో ఉన్నత అధికారుల సాక్షిగా అనేక అవకతవకలు జరుగుతున్నాయి.

### సెల్లార్ లో పార్కింగ్ అన్న నిబంధన అమలు ఎక్కడ.?

జిహెచ్ఎంసి బిల్డింగ్ రూల్స్ ప్రకారం సెల్లార్ ప్రాంతాన్ని కేవలం పార్కింగ్ కోసమే వినియోగించాలి. కానీ వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. నగరంలోని అనేక ప్రాంతాల్లో సెల్లార్‌లను షాపులు, గోదాములు, కార్యాలయాలుగా మార్చి వ్యాపారాలు సాగుతున్నాయి. ఆశ్చర్యకరంగా, అలాంటి అక్రమ వ్యాపారాలకు కూడా ట్రేడ్ లైసెన్లు మంజూరు అవుతున్నాయి. అంటే జిహెచ్ఎంసి నియమ నిబంధనలు కేవలం కాగితాలకే తప్ప పాటించడానికి పనికిరావు అన్నింటిలుగా మారింది పరిస్థితి. దీంతో రోడ్డుపై వాహనాల పార్కింగ్ సమస్య మరింత తీవ్రమైంది. పార్కింగ్ కోసం కేటాయించాల్సిన సెల్లార్‌లలో వ్యాపారాలు నడుస్తుండటంతో వాహనాలు రోడ్డుమీదే నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలు, ప్రజలకు తీవ్ర అసౌకర్యాలు నిత్యకృత్యంగా మారాయి. అయిన పాలకులలో అధికారులలో కనీస మార్పు రాకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది ప్రభుత్వాన్ని నిబంధనలను ప్రభుత్వ అధికారులు అమలు పరచనప్పుడు మరి నిబంధనలు ఎందుకో ఉన్నత అధికారులకే తెలియాలి.

### అధికారుల నిర్లక్ష్యమా.. లేక లంచాల వ్యవస్థనా.?

జిహెచ్ఎంసి పరిధిలో మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా ట్రేడ్ లైసెన్లు ఎలా జారీ అవుతున్నాయి. మున్సిపల్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయకుండా కేవలం ఫైళ్ల ఆధారంగా లైసెన్లు మంజూరు చేస్తున్నారా. లేకపోతే అక్రమాలకు వెనుక లంచాల వ్యవస్థ పనిచేస్తోందా. అన్న అనుమానాలు బలపడుతున్నాయి. కొన్ని సర్కిళ్లలో రెసిడెన్షియల్ అనుమతులు ఉన్న భవనాలలో అనేక వ్యాపార లైసెన్లు, పార్కింగ్ స్థలం లేకపోయినా ట్రేడ్ లైసెన్లు ఇచ్చిన ఉదంతాలు బయటపడుతున్నాయి. ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### ప్రభుత్వం కళ్లు మూసుకుందా.?

జిహెచ్ఎంసి పరిధిలో జరుగుతున్న ట్రేడ్ లైసెన్ల అవినీతిపై ప్రభుత్వం ఇప్పటికైన స్పందించాలన్న డిమాండ్ ప్రజల నుండి బలంగా వినిపిస్తోంది. సెల్లార్ వ్యాపారాలపై సమగ్ర విచారణ, అక్రమంగా జారీ చేసిన లైసెన్ల రద్దు చేయాలని బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. లేదంటే ప్రభుత్వ నిబంధనలపై ప్రజలకు నమ్మకం పూర్తిగా పోతుందని విశ్లేషకుల హెచ్చరికలు వినిపిస్తున్నాయి. అయితే ట్రేడ్ లైసెన్స్ జారీరలో ప్రభుత్వ అధికారులు భారీగా దండుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి ప్రభుత్వానికి ఇంటలిజెన్స్, విజిలెన్స్ రిపోర్ట్ అందడం లేదా మరి అందుకే ఎందుకంత నిర్లక్ష్యం చేస్తుందో. పాలకులకే తెలియాలి.

# వీధి కుక్కల స్వైర్య విహారం - భయాందోళనల్లో ప్రజలు

- గుంపులు గుంపులుగా రోడ్లపై తిష్ట
- రోజురోజుకు పెరుగుతున్న దాడులు
- కుక్కల దాడుల్లో ప్రాణాలు కోల్పోతున్న చిన్నారులు
- దాడులు జరిగిన సమయంలో మాత్రమే అధికారుల హడావుడి
- కుక్కల సంతానోత్పత్తి ఆపరేషన్లు, చికిత్సలకు నిధులు సిబ్బంది కొరత



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహ నగరంతో పట్టణాలు, గ్రామాల్లో ప్రజలు వీధి కుక్కల బెడద తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. వీధులు, రోడ్లపై గుంపులు గుంపులుగా సంచరిస్తూ, ద్విచక్ర వాహనదారులను వెంబడించి దాడులు చేయడం, గాయపరచడం కలకలం రేపుతోంది. అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోకపోవడంతో ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరం, పట్టణం, గ్రామం అనే తేడా లేకుండా గుంపులు, గుంపులుగా రోడ్లపై తిరుగుతు, పిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్ర వాహనదారులను వెంబడించి పరుగుపెట్టిస్తున్నాయి. వీధికుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రాత్రివేళల్లో రోడ్లపైకి గుంపుగుంపులుగా వచ్చి రోడ్లపై నుంచి వెళ్ళే వారిపై దాడులు చేస్తుండడంతో కుక్కలు కనబడితే చాలు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. ప్రతిరోజు ఎక్కడో ఒక చోట వీధి కుక్కల బారిన పడి గాయపడిన సంఘటన జరుగుతూనే ఉన్నాయి. సంఘటనలు జరిగినప్పుడే స్పందించే అధికారులు తరువాత పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

### నామమాత్రంగా చర్యలు

కుక్కల సంఖ్య నియంత్రించే చర్యలో భాగంగా బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు, వ్యాక్సినేషన్ పరిస్థితి నామ మాత్రంగా చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో కుక్కలను ఒకేసారి పెద్ద సంఖ్యలో తీసుకువచ్చి వాటికి వాక్సినేషన్ చేసి బర్త్ కంట్రోర్ చికిత్స చేసేందుకు అవసరమైన సిబ్బంది సరైన వసతులు నిధులు లేకపోవడంతో కుక్కల సంఖ్య నియంత్రణకు చర్యలు ముందుకు సాగకపోవడంతో కుక్కల సంఖ్య గణనీయంగా పెరిగుతుందని సంబంధిత అధికారులు చెబుతుండడం గమనార్హం.

### కుక్కలతో సోకే వ్యాధులు

వీధి కుక్కల స్వైర విహారం వల్ల ప్రజలకు కొన్ని ప్రమాదకర వ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా కుక్కకాటు ద్వారా రాబిస్ ఇతర వైరల్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ సోకే అవకాశం ఉంది. అంతేకాకుండా, పరాన్నజీవులు, లైమ్ వ్యాధి, రాకీ మౌంటెన్ మచ్చల జ్వరం మొదలైన వ్యాధులు కూడా సోకే ప్రమాదం ఉంది.రాబిస్ అనేది ఒక వైరల్ వ్యాధి, ఇది జంతువుల ద్వారా మానవులకు సోకుతుంది. కుక్కకాటు ద్వారా రాబిస్ సోకితే, అది ప్రాణాంతకం కావచ్చు.వీధి కుక్కలు కలుషితమైన ప్రాంతాలలో సంచరిస్తూ, వాటి ద్వారా బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్స్ సోకే ప్రమాదం ఉంది.

వీధి కుక్కలకు టిక్ వంటి పరాన్నజీవులు సోకి ఉంటాయి. ఈ పరాన్నజీవులు కుక్కకాటు ద్వారా మానవులకు సోకి, లైమ్ వ్యాధి, రాకీ మౌంటెన్ మచ్చల జ్వరం మొదలైన వ్యాధులకు కారణం కావచ్చు.వీధి కుక్కలు కాటు వేయడం వల్ల గాయాలు, ఇన్ఫెక్షన్లు, రాబిస్ ఇతర వ్యాధులు సోకే అవకాశం ఉంది. వీధి కుక్కలకు దూరంగా ఉండటం మంచిది. కుక్కకాటుకు గురైనట్లయితే, వెంటనే వైద్యుడిని సంప్రదించాల్సిన అవసరం ఉంది

రాబిస్ వ్యాధిని నివారించడానికి, టీకాలు వేయించుకోవడం ఎంతో ముఖ్యం. పెంపుడు కుక్కలను కలిగి ఉంటే, వాటికి సరైన చికిత్సలు, వాక్సినేషన్ చేయించి వ్యాధి రహితంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే సంబంధిత అధికారులు ఈ విషయంలో దృష్టి సారించి వీధి కుక్కలకు టీకాలు వేయించడం, సంతానోత్పత్తి నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తు రాత్రి వేళల్లో కుక్కల సంచారంపై నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏదిఏమైనా కుక్కల బెడద నుంచి విముక్తి పొందేందుకు సంబంధిత శాఖాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# ముగిసిన హల్వా వేడుక

**- బడ్జెట్ ప్రవేశపెట్టేవరకు వాళ్లు బయటికి రారు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కేంద్ర బడ్జెట్ 2026-27 రూపకల్పన ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. ఏటా బడ్జెట్ తయారీలో చివరి ఘట్టానికి సూచనగా నిర్వహించే సంప్రదాయ 'హల్వా వేడుక' మంగళవారం నాడు ఢిల్లీలోని నార్త్ బ్లాక్?లో ఉన్న బడ్జెట్ ప్రెస్?లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి హాజరయ్యారు. బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ ముగింపు దశకు వచ్చిందని, ఇక ప్రింటింగ్ ప్రారంభమవుతుందని ఈ వేడుక సంకేతాన్నిస్తుంది. ఈ వేడుక ముగిసిన వెంటనే బడ్జెట్ రూపకల్పనలో పాలుపంచుకున్న కీలక అధికారులు 'లాక్-ఇన్' పీరియడ్?లోకి వెళతారు. ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్?ను ప్రవేశపెట్టే వరకు వీరంతా బయటి ప్రపంచంతో ఎలాంటి సంబంధాలు లేకుండా పూర్తి ఏకాంతంగా గడుపుతారు. ఫోన్, ఇంటర్నెట్ వంటి సదుపాయాలకు కూడా దూరంగా ఉంటారు. బడ్జెట్?కు సంబంధించిన అత్యంత కీలకమైన, రహస్య సమాచారం బయటకు పొక్కకుండా ఉండేందుకు దశాబ్దాలుగా ఈ కఠిన నిబంధనను పాటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌదరి అధికారులకు హల్వాను వడ్డించి, శుభాకాంక్షలు తెలిపారు. హల్వా వేడుక అనంతరం నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రెస్?ను సందర్శించారు. అక్కడ బడ్జెట్ పత్రాల ముద్రణకు సంబంధించిన తుది ఏర్పాట్లను సమీక్షించారు. బడ్జెట్ రూపకల్పన, ముద్రణ పనుల్లో నిమగ్నమైన సిబ్బందికి, అధికారుల బృందానికి ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని వివిధ విభాగాల కార్యదర్శులు, బడ్జెట్ తయారీ ప్రక్రియతో సంబంధం ఉన్న ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ఏపీకి రానున్న రాహుల్ గాంధీ

**- షర్మిల ఆహ్వానానికి గ్రీన్ సిగ్నల్**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత, లోక్?సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న ఉద్యమంలో పాల్గొనాలని ఆమె చేసిన ఆహ్వానానికి రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించారు. ఏపీ పర్యటనకు వస్తానని, పార్టీ పోరాటంలో భాగస్వామ్యం అవుతానని ఆయన హామీ ఇచ్చినట్టు షర్మిల తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని 10 జనపథ్?లో ఉన్న రాహుల్ గాంధీ నివాసంలో ఈ సమావేశం జరిగింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ ఉద్యమంలో పాల్గొనాల్సిందిగా షర్మిల రాహుల్?ను కోరారు. ఇందుకు రాహుల్ అంగీకరించారని, త్వరలోనే ఏపీకి వస్తానని మాట ఇచ్చారని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 2వ తేదీతో ఉపాధి హామీ పథకం ప్రారంభమై 20 ఏళ్లు పూర్తికానుంది. ఈ నేపథ్యంలో, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామం నుంచే ఈ ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్టు షర్మిల వివరించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని ఆమె వెల్లడించారు.

# ఐదు గంటల పాటు సంతోష్ రావు విచారణ

**- సంతోష్ రావు స్టేట్ మెంట్ ను రికార్డు చేసిన సిట్ అధికారులు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో భాగంగా సంతోష్ రావు విచారణ ముగిసింది. మంగళవారం బీఆర్ఎస్ మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ రావును ప్రత్యేక విచారణ బృందం (సిట్) సుదీర్ఘంగా విచారించింది. ఉదయం ప్రారంభమైన ఈ ప్రక్రియ సుమారు ఐదు గంటల పాటు కొనసాగింది. గతంలో మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ లను ప్రశ్నించిన అధికారులు, ఇప్పుడు సంతోష్ రావును విచారించారు. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఆయనకు ఉన్న సంబంధాలు, అధికారులతో జరిపిన సంభాషణలు, క్షేత్రస్థాయిలో జరిగిన పరిణామాలపై సిట్ అధికారులు కీలక ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన నేతలను వరసగా విచారణకు పిలుస్తుండటంతో ఈ దర్యాప్తు ఎటు దారితీస్తుందో అన్న చర్చ సర్వత్రా సాగుతోంది.బీఆర్ఎస్ ముఖ్య నేతలను ఒక్కొక్కరిగా విచారిస్తున్న తీరును గమనిస్తుంటే, తదుపరి వంతు ఎవరిదన్న ప్రశ్న రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ఇప్పటికే పార్టీ నేతలు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులను సిట్ విచారించిన నేపథ్యంలో, త్వరలోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు కూడా నోటీసులు ఇచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు జోరందుకున్నాయి. ప్రస్తుతానికి సంతోష్ రావు ఇచ్చిన వాంగ్మూలాన్ని విశ్లేషిస్తున్న అధికారులు, సేకరించిన ఆధారాలను బట్టి తదుపరి చర్యలను చేపట్టనున్నారు. మరి సిట్ అధికారులు తదుపరి ఎవరికి నోటీసులు ఇస్తారో, ఈ విచారణ ప్రక్రియ ఎక్కడి వరకు వెళ్తుందో చూడాలి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588